
బదిలీల.. సందడి

- నేటి నుంచి అమల్లోకి ప్రక్రియ
- కోరుకున్న చోటు కోసం జోరుగా పైరవీలు
- ఎమ్మెల్యేల ఆశీస్సులు ఉంటేనే పోస్టింగ్‌లని ప్రచారం
- కూటమి నేతల ద్వారా లేఖల కోసం ఉద్యోగుల ప్రయత్నాలు
- కొందరు ఎమ్మెల్యేలు ఇప్పటికే భారీగా లేఖలు జారీ చేసినట్లు సమాచారం
- వైసీపీతో అంటకాగిన వారి జాబితాలు సిద్ధం చేస్తున్న టీడీపీ నేతలు



కూటమి అధికారం చేపట్టి రెండు నెలలు దాటగా.. బదిలీలకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఇప్పటికే ఐఏఎస్, ఐపీఎస్‌లతో పాటు కొన్ని స్టేషన్లలో డీఎస్పీ, సీఐ, ఎస్‌ఐల స్థాయి వరకు బదిలీలు చేసింది. ఈ క్రమం లో అందరూ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తోన్న మిగిలిన ప్రభుత్వ శాఖల్లో వివిధ స్థాయిల్లోని ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం సిద్ధమైంది. బదిలీలకు సంబంధించి మార్గదర్శకాలను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నెల చివరి వరకు కూడా బదిలీలపై నిషేధాన్ని ప్రభుత్వం తొలగించింది. దీంతో సోమవారం నుంచి బదిలీల సందడి మొదలుకానున్నది. 15 శాఖల్లో అధికారులు, ఉద్యోగుల బదిలీలు జరగ నున్నాయి. బదిలీలకు ఎమ్మెల్యేల లేఖ తప్పని సరి అన్న ప్రచారంతో ఆయా శాఖల అధికారులు, ఉద్యోగులు ఎవరిస్థాయిలో వారు ప్రయ త్నాలు మొదలుపెట్టారు. ఇప్పటికే కొందరు ఎమ్మెల్యేలు కొందరికి సిఫార్సు లేఖలు ఇవ్వగా మిగిలిన వారు కూటమి నేతల ద్వారా ఎమ్మెల్యేలపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నా ల్లో నిమగ్నమ య్యారు. అదేవిధంగా గత ప్రభుత్వ హయాంలో వైసీపీ నేతలతో అంటకాగి వారు చెప్పినట్లు చేసి.. వారి అక్రమాలకు సహకరించిన అధికారులు, ఉద్యోగుల జాబితాలను టీడీపీ నేతలు సిద్ధం చేసి బదిలీల్లో వారికి ప్రాధాన్యం లేకుండా చేసేందుకు సిద్ధమవుతున్నారని తెలిసింది.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

వైసీపీ ఓడిపోయింది.. కూటమికి ప్రజలు అధికారం ఇచ్చారు.. చంద్రబాబు ముఖ్యమంత్రిగా రెండు నెలల క్రితం బాధ్యతలు చేపట్టారు. వైసీపీ ప్రభుత్వంలో కొందరు అధికారులు, ఉద్యోగుల తీరుతో పలువురు ఇబ్బందులు పడ్డారు. ఈ పరిస్థితుల్లో అలా ఇబ్బందులు పడిన వారితో పాటు కూటమి నేతలు కూడా అధికారులు, ఉద్యోగుల బదిలీ కోసం ఎదురుచూస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఎట్టకేలకు ప్రభుత్వం బదిలీల ప్రక్రియను సోమవారం నుంచి అమలు చేయాలని నిర్ణయించింది. ఈ క్రమంలో ఈ నెల 31 వరకు బదిలీల ప్రక్రియ జరగనున్నది. దీంతో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో బదిలీలకు రంగం సిద్ధమైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలోనే బదిలీలు ఉంటాయని ఉద్యోగులు, అధికారులు భావించారు. అయితే ప్రభుత్వం కుదురుకున్న తర్వాత కింది స్థాయిలో బదిలీలు ప్రక్రియ మొదలు పెట్టాలని పాలకులు నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే రెండు నెలల తర్వాత బదిలీల ప్రక్రియకు ప్రభుత్వం ఆమోదం తెలిపి మార్గదర్శకాలను జారీ చేసింది. ఎన్నికల విధుల్లో భాగంగా ఇతర జిల్లాలకు వెళ్లిన తహసీల్దార్లు ఇప్పటికే జిల్లాలకు రాగా వారికి పోస్టింగ్‌లు ఇచ్చారు. రెవెన్యూ శాఖలో డీటీ, ఆర్‌ఐలు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, వీఆర్వోల బదిలీలు మిగిలాయి. వీఆర్వోల సంఖ్య వందల్లోనే ఉంది. పొరుగు జిల్లాలకు వెళ్లిన ఎంపీడీవోలు ఇటీవలే జిల్లాలకు చేరుకున్నారు. వివిధ మండలాలకు వారిని కేటాయించగా వారు విధుల్లో చేరారు. పంచాయతీరాజ్ శాఖ పరిధిలో ఐదేళ్ల సర్వీసు పూర్తయిన వారి సంఖ్య ఎక్కువగానే ఉంది. వీరందరికీ స్థానచలనాలు తప్పేలా లేవు. గ్రామాల్లో కీలకంగా వ్యవహరించే వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శుల బదిలీలపై గ్రామ స్థాయిలో టీడీపీ నేతలు ప్రత్యేక దృష్టి సారించారు. వైసీపీతో అంటకాగిన ఉద్యోగుల జాబితాలను సిద్ధం చేశారు. దీంతో సదరు ఉద్యోగులు కంగుతింటున్నారు. పోలీసు శాఖలో సీఐ, ఎస్‌ఐల బదిలీలు కొంత మేర పూర్తి చేశారు. ఏఎస్‌ఐలు, కానిస్టేబుళ్ల బదిలీలు కూడా పెద్ద ఎత్తున జరగనున్నాయి. కొన్ని చోట్ల సీఐ, ఎస్‌ఐల బదిలీలు చేయాల్సి ఉంది.

అధికారుల లాబీయింగ్‌లు..

పలువురు అధికారులు, ఉద్యోగులు కోరుకున్న చోటకు బదిలీ అయ్యేలా ఎవరి ప్రయత్నాల్లో వారు నిమగ్నమయ్యారు. బదిలీలకు ఎమ్మెల్యేల లేఖ తప్పని సరి అన్న ప్రచారం జరుగుతోంది. దీంతో వారి లేఖలు పొందేందుకు అధికారులు లాబీయింగ్ చేసుకుంటున్నారు. ఇందుకోసం ప్రజాప్రతినిధుల ఇళ్లకు క్యూ కడుతున్నారు. ఇప్పటికే కొందరు ఎమ్మెల్యేలు బదిలీల సిఫార్సు లేఖలు పెద్దఎత్తున జారీ చేశారని సమాచారం. కొందరు అధికారులు అనుకూల పోస్టింగ్‌లకు సిఫార్సు లేఖల కోసం టీడీపీ నేతల ద్వారా ఎమ్మెల్యేలపై ఒత్తిడి తెస్తున్నారు. నాలుగైదు రోజుల్లో సిఫార్సుల లేఖ జారీ ప్రక్రియ పూర్తవుతుందని టీడీపీ నేతలు చెబుతున్నారు. వైసీపీ నేతలతో కలిసి పనిచేసిన అధికారులకు కూడా కొన్ని చోట్ల వారు కోరుకున్న చోట పోస్టింగ్ కోసం లేఖలు జారీ చేశారన్న విమర్శలు టీడీపీ వర్గాల నుంచి వస్తున్నాయి.

అక్రమాలపైనా నేతల దృష్టి..

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని వివిధ శాఖలకు చెందిన ఇంజనీరింగ్ విభాగాల్లోని కొందరు ఉద్యోగులు, అధికారులు ఇష్టారాజ్యంగా చెలరేగారు. వైసీపీ నేతల అవినీతికి పూర్తి స్థాయిలో సహకరించారు. ఈ ఫిర్యాదులపై ఇప్పటికే కూటమి నేతలు ఫిర్యాదులు చేశారు. కొన్ని చోట్ల అక్రమాలకు పాల్పడిన ఇంజనీర్లపై విజిలెన్స్ విచారణ జరపాలని టీడీపీ నేతలు సదరు శాఖల ఉన్నతాధికారులను ఆశ్రయిస్తున్నారు. దీంతో విజిలెన్స్ విచారణ తప్పదని ఆయా అధికారులు, ఉద్యోగులకు భయం పట్టుకుంది. కొందరు ఇంజనీర్ల అవినీతి, అక్రమాల చిట్టాను ఇప్పటికే విజిలెన్స్ అధికారులకు అందించారు. టిడ్కోలో పొరుగు జిల్లాల్లో విజిలెన్స్ విచారణ జరుగుతోంది. మున్సిపాల్టీలను కొందరు వైసీపీ నేతలు జేబు సంస్థలుగా వాడుకున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని పలు మున్సిపాల్టీల్లో పెద్దఎత్తున అక్రమాలు జరిగాయి. రూ.కోట్లలో నిధులు స్వాహా చేశారు. పచ్చదనం మాటున నిధులు కాజేశారు. సీ బిల్లుల పేరుతో పెద్దఎత్తున నిధులను గోల్‌మాల్ చేశారు. మున్సిపాల్టీలపై కూడా విజిలెన్స్ విచారణ జరుగుతుందన్న ప్రచారంతో సదరు అధికారులు బదిలీలపై వెళ్లే పనిలో ఉన్నారు. సచివాలయ కార్యదర్శులకు కూడా స్థానచలనం ఉన్న నేపథ్యంలో ఈ పోస్టింగ్‌లపై కూడా కూటమి నేతలు ప్రత్యేకంగా దృష్టి సారించారు.



సంక్షేమం సంక్షోభం

- వసతిగృహాల్లో విద్యార్థుల అవస్థలు
- హాస్టళ్లలో సౌకర్యాల లేమి భద్రత గాలిలో దీపం
- ఐదేళ్లుగా యువత స్వయం ఉపాధి పథకాలు నిర్వీర్యం
- శాఖలో పాతుకు పోయిన అధికారులు..
- పనితీరుపై విమర్శలు
- బినామీల చేతుల్లో ఎస్సీ కార్పొరేషన్ షాపింగ్ కాంప్లెక్సులు
- వైసీపీ హయాంలో శాఖపై ఒక్కసారి కూడా జరగని సమీక్ష
- కూటమి ప్రభుత్వంలోనైనా సాంఘిక సంక్షేమ శాఖ పనితీరు గాడిలో పడేనా?
- నేడు నాగార్జున వర్సిటీలో మంత్రి డోలా సమీక్ష

గుంటూరు(విద్య), ఆగస్టు 18: ఐదేళ్లుగా సంక్షేమం సంక్షోభంలో చిక్కుకుంది. వసతిగృహాల్లోని విద్యార్థుల సంక్షేమం గురించి ఆలోచించలేదు. ఎస్సీ యువత స్వయం ఉపాధిపై దృష్టి సారించలేదు. సాంఘీక సంక్షేమ వసతిగృహాల్లో విద్యార్థుల భద్రత గాలిలో దీపంలా మారినా.. ఆకలి కేకలతో అలమటిస్తున్నా.. కాస్మోటిక్స్, డైట్‌చార్జీలు చెల్లింపుల్లో జాప్యం.. ఇలా ఎన్నో సమస్యలతో సతమతం అవుతున్నా వైసీపీ పాలకులు పట్టించుకోలేదు. వైసీపీ పాలనలో ఐదేళ్లు సంక్షేమ శాఖపై సమీక్షే జరగలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. పట్టించుకోని పాలకుల హయాంలో యథా రాజా తథా ప్రజ అన్నట్లుగా అధికారులు కూడా తమకెందుకులే అన్న ధోరణిలో సంక్షేమ శాఖలో ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం సాంఘీక సంక్షేమ శాఖను తిరిగి గాడిలో పెట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి. ఈ క్రమంలో అనేక సమస్యలతో కునారిల్లుతోన్న సాంఘిక సంక్షేమశాఖపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగా సోమవారం గుంటూరు సమీపంలోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి సమీక్షించనున్నారు.

సంక్షేమంలో.. సమస్యలు

- ఉమ్మడి గుంటూరు జిల్లాలో సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో 70కిపైగా ఉన్న వసతిగృహాల్లో 3 నుంచి 10వ తరగి చదివే విద్యార్థులు 15 వేల మంది వరకు ఉన్నారు. అయితే ఆయా వసతి గృహాల్లో ప్రవేశాలు, సౌకర్యాలపై ఐదేళ్లలో ఒక్కసారి కూడా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. గతంలో డీడీ, కలెక్టర్ స్థాయిలో మూడు నెలలకు ఒకసారి హాస్టళ్లపై సమీక్ష నిర్వహించేవారు. ఫలితంగా విద్యార్థుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి వచ్చేవి. అయితే గడిచిన ఐదేళ్లలో ఒక్కటంటే ఒక్క సమీక్ష కూడా నిర్వహించలేదు.
- సాంఘిక సంక్షేమశాఖ హాస్టళ్లను నాడు నేడు పథకంలో అభివృద్ధి చేస్తామని, సొంత భవనాలు నిర్మిస్తామని గత ప్రభుత్వం హామీ ఇచ్చింది. అయితే ఇందులో ఒక్కటి కూడా నెరవేరలేదు. దాదాపు 40శాతం హాస్టళ్లు అద్దె భవనాల్లోనే ఉన్నాయి.
- సాంఘిక సంక్షేమశాఖ హాస్టళ్ల వెల్ఫేర్ అధికారులు ఎప్పుడు వస్తారో, ఎప్పుడు వెళ్తారో ఎవరికీ తెలియదు. ఫలితంగా ఇక్కడ వసతి పొందే విద్యార్థినుల భద్రత గాల్లోదీపంలా మారింది. గుంటూరు నగర నడిబొడ్డున ఉన్న సాంఘిక సంక్షేమశాఖ హాస్టల్ విద్యార్థినుల్ని యువకులు మాయమాటలు చెప్పి కిడ్నాప్ చేసిన సంఘటన ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. దీనిని బట్టి వసతి గృహాల్లో విద్యార్థినుల భద్రతపై తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.
- విద్యార్థినుల చేత మ్యాట్రిన్లు పనులు చేయిస్తున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి. గుంటూరుతో పాటు వివిధ ప్రాంతాల్లోని కొన్ని హాస్టళ్లలో విద్యార్థినులు ఈ సమస్యలు ఎదుర్కొంటున్నారు.



- సాంఘిక సంక్షేమశాఖలో పనిచేసే కొంతమంది అధికారులపై తీవ్రస్థాయిలో ఆరోపణలు ఉన్నాయి. ఉద్యోగన్నతులు, సర్వీసులు, కాంట్రాక్టు ఉద్యోగుల నియామకం వంటి విషయాల్లో ఆరోపణలు ఉన్నాయి. దీనికి తోడు వార్డెన్లు, మ్యాట్రిన్ల నుంచి అధికారులు మామూళ్లు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులు ఉన్నాయి.
- ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో అనేక ప్రాంతాల్లో షాపింగ్ కాంప్లెక్స్‌లు ఉన్నాయి. ఈ కాంప్లెక్సులోని దుకాణాలు బినామీ పేర్లతో సబ్ లీజుల్లో నడుస్తున్నాయి. వేలాది రూపాయలు అద్దెవసూలు చేస్తూ పైసా కూడా శాఖకు చెల్లించని ప్రబుద్ధులు ఉన్నారు.
- ఎస్సీ కార్పొరేషన్ ద్వారా యువతకు అందే స్వయం ఉపాధి పథకాలు ఐదేళ్లుగా నిర్వీర్యమయ్యాయి. భూమి కొనుగోలు పథకం, మహిళా స్వయం ఉపాధి వంటి రాష్ట్రస్థాయి పథకాలతో పాటు కేంద్రం అమలు చేసే సఫాయికర్మచారి పథకాల్ని గత వైసీపీ ప్రభుత్వం అటకెక్కించింది.
- వసతిగృహాల్లోని విద్యార్థులకు డైట్, కాస్మోటిక్స్ చార్జీలు కోట్లలో పెడింగ్‌లో ఉన్నాయి.

197 మందికి ఒకే ఉపాధ్యాయుడు

- గురుకులంలో బాలికల విద్యకు గ్రహణం
- గిరిజన బాలికల పాఠశాలపై ప్రభుత్వం శీతకన్ను
- పెదతురకపాలెం పాఠశాలలో అటకెక్కిన చదువులు
- టీసీలు తీసుకు వెళుతున్న పదో తరగతి విద్యార్థినులు

నరసరావుపేట టౌన్, ఆగస్టు 18: ఇటీవలే ఆదివాసీ దినోత్సవాన్ని ప్రభుత్వం ఘనంగా నిర్వహించింది. అయితే ఆ స్థాయిలో వారి సమస్యలపై అధికారులు కానీ, పాలకులు కానీ దృష్టి సారించడంలేదని ఆ వర్గాల నుంచి విమర్శలు వస్తున్నాయి. నరసరావు పేట మండ లం పెదతురకపాలెం గ్రామం వద్ద ఉన్న గిరిజన గురుకుల బాలికల పాఠశాల దుస్థితే ఇందుకు నిదర్శనంగా కనిపిస్తోంది. 2016లో టీడీపీ హయాంలో ఏర్పాటు చేసిన గిరిజన గురుకుల బాలికల పాఠశాల గురించి వైసీపీ ప్రభుత్వం నాలుగేళ్లుగా పట్టించుకోలేదు. గురుకుల గిరిజన బాలికల విద్యకు గ్రహణం పట్టినా నాటి ప్రభుత్వం పట్టిం చుకోలేదు. 197 మంది విద్యార్థినులున్న



వరండాలో చదువుకుంటున్న విద్యార్థినులు

పాఠశాలపై నాటి ప్రభుత్వం శీత కన్ను వేయగా, కూటమి ప్రభుత్వ హయాంలోనూ అదే పరిస్థితి నెలకొందని తల్లిదండ్రులు వాపోతున్నారు.

ప్రారంభించి.. పట్టించుకోలేదు..

పల్నాడు జిల్లా పరిధిలోని ఆదివాసీ గిరిజన బాలికల కోసం కేంద్ర ప్రభుత్వ నిధులతో టీడీపీ హయాంలో పాఠశాలను ఏర్పాటు చేశారు. అయితే వైసీపీ ప్రభుత్వం కేంద్రం విడుదల చేసిన నిధులను రాష్ట్ర ఖజానాకు మళ్లించుకుని పాఠశాల నిర్మాణాన్ని సకాలంలో పూర్తి చేయలేదు. ఎన్నికలకు ముందు పాఠశాలను ప్రారంభించి చేతులు దులుపుకుంది. ఇక్కడ ఆరు నుంచి 10 వరకు తరగతులకు 197 మంది బాలికలు చదువుతున్నారు. ఆరంభంలోనే అడ్మిషన్లు బాగా ఉన్నా, పాఠశాలలో అన్ని వసతులు ఉన్నా చదువు చెప్పేందుకు ఉపాధ్యాయులు లేకపోవడం విశేషం. ఉపాధ్యాయ నియామకాలను ప్రభు త్వం విస్మరించింది. దీంతో తరగతులు జరగక బాలికలు విద్యకు దూరమవుతున్నారు. ఉపాధ్యాయులు లేకపోవ డంతో పదోతరగతి విద్యార్థునులు టీసీలు తీసుకు వెళ్తున్నారు.

ప్రిన్సిపాల్, ఉపాధ్యాయుడు ఒకరే..

గిరిజన గురుకుల బాలికల పాఠశాలకు ప్రిన్సిపల్, ఉపా .ద్యాయుడు ఒకరే. ఆయనే అన్ని తరగతులు నిర్వహించా ల్సిన దుస్థితి నెలకొంది. కాంట్రాక్ట్ విధానంలో మరొకర్ని నియమించినా సదరు ఉపాధ్యాయుడు విధులకు సక్రమంగా హాజరు కావడం లేదని తల్లిదండ్రులు తెలిపారు. బాలి కల పాఠశాలకు గతంలో ఉన్న మహిళా ప్రిన్సిపాల్‌ను బదిలీ చేసి పురుషుడ్ని ఇక్కడ నియమించారు. ఉపాధ్యా యుల కొరతపై గిరిజన సంక్షేమ శాఖ అధికారులను వివ రణ కోరగా ఇది గిరిజన శాఖ కార్యదర్శి పరిధిలో అం శమని తామేమీ చెప్పలేమన్నారు.


నీరున్నా.. సాగు సంకటమే

- నెంబర్ వన్ కాల్వ నిండా పూడిక
- సాగునీరు విడుదలైనా అందని వైనం
- నెర్రెలిస్తున్న వెదనాట్ల పొలాలు.. రైతుల ఆందోళన



పిచ్చి మొక్కలతో పూడుకుపోయిన నెంబర్ వన్ కాల్వ

వేమూరు, ఆగస్టు 18: పుష్కలంగా వర్షాలు కురిశాయి.. కాల్వల ద్వారా పుష్కలంగా అందుతున్న సాగునీరు. అయితే వేమూరు పరిధిలోని రైతులు సాగునీటి కోసం తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ముందస్తుగా వెదనాట్లు వేసిన భూములు నీరు లేక నెర్రెలిస్తున్నాయి. దీంతో రూ.వేలల్లో వ్యయం చేసిన అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్ సాగుకు అధికారులు ముందస్తుగా చర్యలు తీసుకోని కారణంగా రైతులకు శాపంగా మారింది. కొల్లిపర చానల్ ద్వారా నీరు వస్తున్నా నెంబర్ వన్ కాల్వకు అందడం లేదు. దీంతో ఈ కాల్వ పరిధిలోని అబ్బనగూడవల్లి, తాడిగిరిపాడు, బలిజేపల్లి, రావికంపాడు, పెనుమర్రు గ్రామాలకు చెందిన 6వేల ఎకరాల్లో సాగు సంకటంగా మారింది. ఖరీఫ్ సాగుకు ముందుగానే మరమ్మతులు చేపట్టాలని అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోనందునే ప్రస్తుత దుస్థితి అని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం నిధులు కేటాయించని కారణంగా తాము ఏమీ చేయలేకపోతున్నామని నీటిపారుదల శాఖ అధికారులు మౌనం పాటించారు. ఈ కారణంగా భూములకు సాగునీరు అందడం లేదు. 95 శాతం మంది రైతులు వర్షపు నీరు ఆధారంతో వెద నాట్లు వేశారు. అయితే ప్రస్తుతం కాల్వ ద్వారా సాగునీరు అందడం లేదు. ఎండల తీవ్రత కూడా అధికంగా ఉంది. దీంతో భూములు బీటలు వారాయి. నాటిన మొక్కలు దెబ్బతింటున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. కొల్లిపర చానల్ నుంచి ఈ కాల్వకు 220 క్యూసెక్కుల నీటిని వదిలినా ప్రయోజనం లేకుండా ఉంది. కాల్వలో పెరిగిన మొక్కలు, పూడిక సాగునీటి ప్రవాహానికి అడ్డంకి మారాయి. దీంతో కొంచెం కూడా సాగునీరు పంట భూములకు చేరడంలేదు. ఈ పరిస్థితుల్లో ఎండిపోతున్న వరిని కాపాడుకునేందుకు అవకాశం ఉన్న రైతులు భూగర్భ జలాలను మోటార్ల సాయంతో వాడుకుంటున్నారు. అవకాశం లేని రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు గత నెలలో సమీక్ష నిర్వహించి సాగుకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అయినా ఇంతవరకు అధికారుల్లో స్పందన లేదు. ఇప్పటికైనా నీటిపారుదల శాఖ అధికారులు స్పందించి తక్షణ చర్యలు చేపట్టి సహకరించాలని రైతులు కోరుతున్నారు.



అబ్బనగూడవల్లి వద్ద సాగునీరు అందక నెర్రెలిచ్చిన వెదనాటు భూములు

ఏపీపీఎస్సీ పోటీ పరీక్షల ప్రత్యేకం

రీజనింగ్

టైమ్ సీక్వెన్స్ టెస్ట్

1. తేజకు అతని సోదరి నందిత పుట్టినరోజు జూలై 21 నుంచి జూలై 26 మధ్య అని గుర్తు. మరో సోదరుడు భవేష్‌కు వారి సోదరి పుట్టినరోజు జూలై 24 నుంచి 29 మధ్య అని గుర్తు. అయితే నందిత పుట్టినరోజు ఏ రోజు అవుతుంది?

ఎ) జూలై 26 బి) జూలై 25
సి) జూలై 24 డి) ఏదీకాదు

సమాధానం: (బి)

వివరణ: తేజకు అతని సోదరి పుట్టినరోజు జూలై 21 నుంచి 26 మధ్య అని గుర్తు. ఇచ్చిన తేదీలకు మధ్యలోని తేదీలు తీసుకోవాలి. 22, 23, 24, 25 భవేష్‌కు, సోదరి నందిత పుట్టినరోజు జూలై 24 నుంచి 29 మధ్య అని గుర్తు. ఇచ్చిన తేదీలకు మధ్యలోని తేదీలు 25, 26, 27, 28.

గమనించండి: రెండింటిలో కామన్‌గా ఉండే తేదీ '25' అనగా జూలై 25 సమాధానం అవుతుంది.

2. సాత్విక్‌కు అతని తల్లిదండ్రుల పెళ్లి రోజు అక్టోబర్ 7 నుంచి అక్టోబర్ 12 మధ్య అని గుర్తు. అతని సోదరి సౌమికకు వారి తల్లితండ్రుల పెళ్లిరోజు అక్టోబర్ 9 నుంచి అక్టోబర్ 4 మధ్య అని గుర్తు. అతని సాత్విక్, సౌమికల తల్లిదండ్రుల పెళ్లిరోజు అవుతుంది?

ఎ) అక్టోబర్ 10 బి) అక్టోబర్ 11
సి) అక్టోబర్ 10 లేదా 11 డి) ఏదీకాదు

సమాధానం: (సి)

వివరణ: సాత్విక్‌కు అతని తల్లిదండ్రుల పెళ్లి రోజు అక్టోబర్ 7 నుంచి 12కు మధ్య అని గుర్తు. ఇచ్చిన తేదీలకు మధ్య తేదీలు 8, 9, 10, 11. అతను సోదరి సౌమికకు వారి తల్లిదండ్రుల పెళ్లి రోజు అక్టోబర్ 9 నుంచి అక్టోబర్ 14కు మధ్య అని గుర్తు, ఇచ్చిన తేదీలకు మధ్య తేదీలు 10, 11, 12, 13.

గమనించండి: రెండింటిలో కామన్‌గా ఉన్న తేదీలు 10, 11. ఈ విధంగా రెండు తేదీలు వచ్చినప్పుడు అక్టోబర్ 10 లేదా అక్టోబర్ 11 (అనగా either, or)) సమాధానంగా గుర్తించాలి.

3. పవిత్రకు ఆమె సోదరి మేఘన పుట్టినరోజు జనవరి 20 నుంచి జనవరి 24 మధ్య అని గుర్తు. వారి మరో సోదరి మౌనికకు, మేఘన పుట్టినరోజు ఫిబ్రవరి 22, ఫిబ్రవరి 26ల మధ్య అని గుర్తు. అయిన పవిత్ర మౌనికల ప్రకారం వారి సోదరి మేఘన పుట్టినరోజు ఏ రోజు అవుతుంది?

ఎ) జనవరి 23 బి) ఫిబ్రవరి 23
సి) చెప్పలేం డి) ఏదీకాదు

సమాధానం: (సి)

వివరణ: పవిత్రకు ఆమె సోదరి మేఘన పుట్టినరోజు జనవరి 20 నుండి జనవరి 24 మధ్య అని గుర్తు. వారి మరోసోదరి మౌనికకు, మేఘన పుట్టినరోజు ఫిబ్రవరి 22, ఫిబ్రవరి 24ల మధ్య అని గుర్తు.

గమనించండి: ఇద్దరి సమాచారం ప్రకారం నెలలు వేర్వేరుగా ఉన్నాయి. దాదాపు 30 రోజుల తేడా ఉన్నది. కావున సమాధానం చెప్పలేం అవుతుంది.

4. ఒక బస్సు వరంగల్‌కు ప్రతి 45 ని.లకు ఉంది. విచారణాధికారి తనను కలిసిన ప్రయాణికునితో బస్సు వెళ్ళిపోయి 15 ని. అయింది. తరవాత బస్సు 11.30 ఎ.ఎం. అని చెప్పారు. అయిన ఈ సమాచారాన్ని విచారణాధికారి ప్రయాణికునితో ఏ సమయంలో చెప్పారు?

ఎ) 10.50 ఎ.ఎం. బి) 11.00 ఎ.ఎం.
సి) 11.10 ఎ.ఎం. డి) 11.15 ఎ.ఎం.

సమాధానం: (బి)

వివరణ: బస్సు వరంగల్‌కు ప్రతి 45 ని. ఉంది. తదుపరి బస్సు వచ్చే సమయం గం. 11.30 ని. అనగా ముందు బస్సు వచ్చిన సమయం 11.30-45 ని. = గం. 10.45 ని. విచారణాధికారి ప్రయాణికునితో బస్సు వెళ్ళిపోయి 15 ని. అయింది అని చెప్పారు. దాని అర్థం ప్రయాణికుడు 15 ని. అలస్యంగా వచ్చాడు. (అలస్యంగా వస్తేనే కదా బస్సు వెళ్ళి పోయింది) కాబట్టి విచారణాధికారికి, ప్రయాణికునికి మధ్య సంభాషణ జరిగిన సమయం 10.45+15 ని.= 11.00 ఎ.ఎం. అవుతుంది.

5. ఒక కార్యాలయంలో 30 మంది ఉద్యోగులు ఉన్నారు. 10 మంది ఉద్యోగులు మొదటి గ్రూపుగా ఉదయం 7 గం.ల నుంచి మధ్యాహ్నం 1.00 గం. వరకు పని చేస్తారు. 12 మంది వ్యక్తులు రెండో గ్రూపుగా ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 3.00 గం. వరకు పనిచేస్తారు. 8 మంది వ్యక్తులు మూడో గ్రూపుగా ఉదయం 11.00 గం.ల నుంచి సాయంత్రం 5 గం. పనిచేస్తారు. అయితే కార్యాలయంలోని ఉద్యోగులందరూ ఏ సమయం నుంచి ఏ సమయం వరకు కలుసుకుంటారు?

ఎ) 11.00 ఎ.ఎం. నుంచి 1.00 పి.ఎం.



బి) 10 ఎ.ఎం. నుంచి 12 మధ్యాహ్నం
సి) 1 పి.ఎం. నుంచి 3 పి.ఎం. డి) ఏదీకాదు

సమాధానం: (ఎ)

వివరణ: కార్యాలయంలో ఉద్యోగులందరు కలుసుకునే సమయం అనగా మూడు గ్రూపుల వారికి కామన్ టైమ్ తీసుకోవాలి. మొదటి గ్రూపు పని చేసే వేళలు 7.00 ఎ.ఎం. నుంచి 1.00 పి.ఎం.వరకు అనగా 7-8, 8-9, 9-10, 10-11, 11-12, 12-11

రెండో గ్రూపువారు పనిచేసే వేళలు 9.00 ఎ.ఎం. నుంచి 3.00 పి.ఎం. వరకు అనగా 9-10, 10-11, 11-12, 12-1, 1-2, 2-3. మూడో గ్రూపువారు పనిచేసే వేళలు 11.00 ఎ.ఎం. నుంచి 5.00 పి.ఎం. వరకు అనగా 11-12, 12-1, 1-2, 2-3, 3-4, 4-5. **గమనించండి:** మూడు గ్రూపులలో కామన్ టైమ్ 11 నుంచి 1 వరకు అని తెలుస్తున్నది. కాబట్టి మూడు గ్రూపులు కార్యాలయంలో కలిసి పనిచేసే వేళలు 11.00 ఎ.ఎం. నుంచి 1.00 పి.ఎం. సమాధానం అవుతుంది.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్,
సీనియర్ ఫ్యాకల్టీ



కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

ఎస్సీ ఉప వర్గీకరణ
సుప్రీంకోర్టు తీర్పు-నేపథ్యం

భారతీయ సమాజంలో అసమానతలకు బీజం వేసింది నాలుగంచెల చాతుర్వర్ణ వ్యవస్థ. ఎగువ అంచెల వారి కి పాలనాధికారాన్ని, ప్రతిష్ఠను కట్టబెట్టి దిగువ అంచెల వారిని వారికి సేవకులను చేసింది. అన్నింటికన్నా దిగువ అంచె అయిన శూద్రుల్లో సేవక కులాలనన్నింటినీ జమచేయడం జరిగింది. వారి వృత్తులను బట్టి కాలక్రమంలో శూద్రుల్లో కూడా స్థాయీ భేదాలు వచ్చాయి. కొన్ని పనులు చేసేవారు అంటరాని వారయ్యారు. ఊరిలోని మాలిన్యాన్ని తొలగిస్తూ, అందరి ఆరోగ్యాన్ని పరిరక్షిస్తూ తాము మాత్రం ఊరవతలకే పరిమితమయ్యారు. కనీస అవసరాలకు నోచుకోలేదు. కాలక్రమంలో వీరే దళితులుగా పిలువబడ్డారు.

స్వాతంత్ర్యానంతరం భారత రాజ్యాంగం దళితులు, ఆదివాసీలు, ఇతర వెనుకబడిన శూద్ర కులాల వారి అభ్యున్నతికి విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించడం ద్వారా వారి పురోభివృద్ధికి బాటలు వేసింది. అయితే దళితులను(మాల, మాదిగ, వారి ఆశ్రిత కులాలను) షెడ్యూల్డ్ క్యాస్ట్, వివిధ ఆదివాసీ జాతులను షెడ్యూల్డ్ ట్రైబ్స్‌గా పేర్కొంటూ మూకుమ్మడి రిజర్వేషన్లను రెండు వర్గాల్లో అమలు చేశారు. అయితే తదనంతర కాలంలో అనగా 90ల్లో ఇతర వెనుకబడిన కులాలకు కల్పించిన రిజర్వేషన్లలో అన్ని వర్గాలకూ రిజర్వేషన్లు మూకుమ్మడిగా కాక, ఆయా ఉపవర్గాల్లో వెనుకబాటుతనం ఆధారంగా, ఇతర వెనుకబడిన తరగతులను(ఓబీసీ) హేతుబద్ధీకరించి ఏ, బీ, సీ, డీ, ఇ లుగా వర్గీకరించి రిజర్వేషన్లను అమలుచేశారు. ఈ వర్గీకరణ ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో అనుసరించలేదు. దీని కారణంగా ఎస్సీ, ఎస్టీ వర్గాల్లోని కొన్ని ఆధిపత్య కులాలు, జనాభాపరంగా తక్కువ సంఖ్య ఉన్న కులాలు రిజర్వేషన్ ఫలాలను ఎక్కువగా పొందాయి. క్రమంగా వారి తరవాతి తరాలూ ఈ లబ్ధిని కొల్లగొట్టాయి. ఓబీసీల మాదిరి క్రిమిలేయర్ విధానం కూడా ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో లేకపోవడంతో అభివృద్ధి చెందిన ఉప కులాలే మరింత రిజర్వేషన్లు ఉపయోగించుకుని అభివృద్ధి చెందారు. ఇతర ఉపకులాలు అణగారిపోయారు. ఎస్సీ ఎస్టీల్లోని అనేక కులాలు, ఆశ్రిత కులాల్లో దీనిపై అసంతృప్తి ఉన్నప్పటికీ తొలిసారి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీల్లోని మాదిగ కులం వారిలో చైతన్యం వచ్చింది.

> 90ల్లో ఇతర వెనుకబడిన కులాలకు కల్పించిన రిజర్వేషన్లలో అన్ని వర్గాలకూ రిజర్వేషన్లు మూకుమ్మడిగా కాక, ఆయా ఉపవర్గాల్లో వెనుకబాటుతనం ఆధారంగా, ఇతర వెనుకబడిన తరగతులను(ఓబీసీ) హేతుబద్ధీకరించి ఏ, బీ, సీ, డీ, ఇ లుగా వర్గీకరించి రిజర్వేషన్లను అమలుచేశారు.

ఎస్సీ ఉపవర్గీకరణ పోరాట పుట్టినిల్లు తెలుగుగడ్డ

అనాదిగా చర్మకారులుగా అట్టడుగు స్థాయిలో ఉన్న మదిగవారు, తమ తోటి ఉపవర్గం వారితో కూడా అంటరానివారిగా చూడబడ్డారు. తమకన్నా సామాజికంగా ముందున్న మాల వారితో కలిసి ఉమ్మడిగా అవకాశాలు పంచుకోవాల్సి రావడం అన్యాయంగా గుర్తెరిగారు.

జనాభాపరంగా తమకంటే తక్కువ సంఖ్యలో ఉన్న మాల వారు ఉమ్మడి రిజర్వేషన్లు కారణంగా ఎక్కువ లబ్ధి పొందుతున్నారని గ్రహించారు. తమకు ప్రత్యేకంగా రిజర్వేషన్లు అమలుచేయాలని ఏడో దశకం నుంచి ప్రభుత్వాలకు వినతులు సమర్పిస్తున్నారు. అయితే 1994లో 'మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి' ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా ఈదుమూడిలో మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఏర్పాటైన నాటినుంచి ఎస్సీ ఉపవర్గీకరణ పోరాటం ఉద్యమ స్థాయిని అందుకుంది. తమ పోరాటానికి 'మాదిగ దండోరా' ఉద్యమంగా నామకరణం చేశారు. వరుసగా భారీఎత్తున దండోరా సభలు, ర్యాలీలు నిర్వహించారు. ఎస్సీల్లో ఉపకులాలను వారి సామాజిక స్థాయి, జనాభా ఆధారంగా వర్గీకరించి ఎస్సీ రిజర్వేషన్లను ఏ, బీ, సీ, డి అనే కేటగిరీలుగా అమలు చేయాలని కోరారు. అన్ని రాజకీయ పార్టీలు, సమాజం నుంచి మద్దతు కూడగట్టారు.

ఈ ఉద్యమఫలంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1996లో జస్టిస్ రామచంద్రరాజు కమిషన్‌ను ఏర్పాటుచేసి సమస్య పరిష్కారానికి సూచనలు కోరింది. 1997లో ఈ కమిషన్ ఎస్సీలను ఏ, బీ, సీ, డీ కేటగిరీలుగా వర్గీకరించి రిజర్వేషన్ ఫలాలు అట్టడుగు వర్గాలకు చేరేవిధంగా చర్యలు తీసుకోమని సూచించింది. తత్ఫలితంగా 1997 జూన్ 6న అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎస్సీలకు ఉన్న 15% కోటాను ఏ, బీ, సీ, డీ వర్గాలుగా విభజిస్తూ ఒక జీవోను విడుదల చేసింది. ఏ గ్రూపులో రెల్లి, దాని అనుబంధ కులాలను చేర్చి 1 శాతం కోటాను, బీ గ్రూపులో మాదిగ, దాని ఉప కులాలను చేర్చి 7శాతం కోటా, సీ గ్రూపులో మాల, దాని ఉపకులాలను చేర్చి 6శాతం కోటా, డీ గ్రూపులో ఆది ఆంధ్రులతో పాటు ఇతర కులాలను చేర్చి 1 శాతం కోటాను ఇచ్చారు. ఈవిధంగా ఏ గ్రూపును ఎస్సీల్లో అట్టడుగు కులాల గ్రూపుగా తదుపరి బీ, సీ, డీలను క్రమానుగతంగా దాని పైస్థాయి గ్రూపులుగా వర్గీకరించి ఎస్సీ రిజర్వేషన్లలో కోటాను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అయితే మాలలు ఈ విధానానికి వ్యతిరేకంగా ఉద్యమించారు. మాల మహానాడు సంఘం ఈ రిజర్వేషన్ వర్గీకరణను న్యాయస్థానంలో సవాలు చేసింది.

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ జీవో రాజ్యాంగ విరుద్ధమని, రాష్ట్రప్రభుత్వ అధికార పరిధిలో లేని విషయమని తీర్పు ఇవ్వడంతో మళ్లీ సమస్య మొదటికి వచ్చింది. తదుపరి మరలా ఎంఆర్‌పీఎస్ పోరుబాట పట్టింది. దీంతో 2000 సంవత్సరంలో అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'ఎస్సీ రిజర్వేషన్ల హేతుబద్ధీకరణ చట్టం' ద్వారా తిరిగి ఎస్సీ ఉప వర్గీకరణను ప్రవేశపెట్టింది. 2004 నవంబరు వరకూ ఈవిధంగా ఎస్సీ ఉప వర్గీకరణ చట్టం అమలులో ఉంది. 2004లో ఇ.వి.చెన్నయ్య వర్సెస్ స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కేసులో 5గురు సభ్యుల సుప్రీంకోర్టు ధర్మాసనం ఎస్సీ ఉప వర్గీకరణ చెల్లదని, ప్రకరణ 341(1) ప్రకారం రాష్ట్రపతి ఉత్తర్వుల మేరకు సజాతీయ కులాలను ఎస్సీలుగా వర్గీకరించారని, దానిని తిరిగి ఉప వర్గీకరించే అధికారం రాష్ట్రప్రభుత్వాలకు లేదని తీర్పునిచ్చింది. దీంతో మరలా కథ మొదటికి వచ్చింది. తిరిగి ఎంఆర్‌పీఎస్ ఉద్యమించడంతో అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎస్సీ ఉప వర్గీకరణకు పార్లమెంటు రాజ్యాంగ సవరణ చట్టం తీసుకురావాల్సిందిగా కోరుతూ అసెంబ్లీలో ఒక తీర్మానం చేసింది. దీంతో కేంద్రం 2007లో ఉషామెహ్రా కమిషన్‌ను ఏర్పాటుచేసి ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ ఉపవర్గీకరణ అంశానికి సంబంధించి ఎదురయ్యే రాజ్యాంగ, చట్టపరమైన అవరోధాలను పరిశీలించి తగిన సూచనలు చేయాల్సిందిగా కోరింది. 2008లో నివేదిక సమర్పించిన ఈ కమిషన్ రాజ్యాంగ ప్రకరణ 341కి క్లాజ్ 3ని చేర్చి, రాజ్యాంగాన్ని సవరించడం ద్వారా రాష్ట్ర అసెంబ్లీలు ఏకగ్రీవ తీర్మానం చేసినప్పుడు పార్లమెంటు ఆమోదించే అవకాశాన్ని ఏర్పాటు చేయవచ్చని సూచించింది. ఈ సూచనలు అమలుకు నోచుకోలేదు.

(మిగతా రేపటి దిక్సూచిలో)



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

రాజకీయాల్లో..
క్షత్రియులకు అవకాశం కల్పిస్తాం

- క్షత్రియభవన్‌కు భూమిని కేటాయిస్తాం
- క్షత్రియ సేవా సమితి.. అభినందన సభలో తెలంగాణ సీఎం రేవంత్
- ప్రభాస్ సినిమాపై పొగడ్తల వర్షం
- తెలుగు సినిమాను విశ్వవ్యాప్తం చేశారని వ్యాఖ్య



క్షత్రియ సేవాసమితి అభినందన సభలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ/రాయదుర్గం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రాజకీయాల్లో క్షత్రియ సామాజికవర్గానికి తగిన ప్రాతినిధ్యం కల్పిస్తామని, నగరంలో క్షత్రియ భవన్ నిర్మాణానికి స్థలం కేటాయిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఆదివారం ఆయన గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో క్షత్రియ సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించిన అభినందన సభలో పాల్గొని, ప్రసంగించారు. 1960లలోనే క్షత్రియులు ఆంధ్రప్రాంతం నుంచి హైదరాబాద్‌కు వచ్చి.. ద్రాక్ష తోటలు, పౌల్ట్రీ వంటి వ్యాపారాలు నిర్వహించారని.. శ్రమ, అకుంఠిత దీక్షతో ఉన్నతస్థాయికి ఎదిగారని రేవంత్‌రెడ్డి వివరించారు. కష్టపడే గుణం వల్ల క్షత్రియులు ఎక్కడైనా విజయవంతమవుతారన్నారు. "క్షత్రియులకు రాజకీయాల్లో తగిన ప్రోత్సాహం అందిస్తాం. మీరే తగిన పేర్లు ఇస్తే.. వారికి పార్టీ పదవులు ఇచ్చి.. కార్పొరేటర్, ఎమ్మెల్యే ఎన్నికల్లో అవకాశం కల్పిస్తాం" అని క్షత్రియ సేవాసమితిని కోరారు. ఆంధ్రాలో అల్లూరి సీతారామరాజు, తెలంగాణలో కొమరం భీం పోరాట యోధుల స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని.. ముందుకెళ్తున్నామన్నారు. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌లతోపాటు ఫ్యూచర్‌సిటీని అభివృద్ధి చేయబోతున్నామని, దానిలో కూడా రాజులు భాగస్వాములు కావాలన్నారు. పెట్టుబడులతో ముందుకొస్తే అన్నివిధాల ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. హైదరాబాద్ అభివృద్ధిలో క్షత్రియ కమ్యూనిటీ భాగస్వామ్యం ఉందన్నారు. కర్ణాటకలో రాజకీయ సమీకరణలు, పరిస్థితుల ప్రభావం వల్ల బోసురాజుకు పోటీచేసే అవకాశం రాలేదన్నారు. మంత్రివర్గం ఏర్పాటు సమయంలో మంత్రి పదవి కేటాయించాలని స్వయంగా రాహుల్‌గాంధీ చెప్పారని గుర్తుచేశారు. దీన్ని బట్టి.. రాజులు క్రమశిక్షణతో పనిచేస్తారనే అభిప్రాయం అధిష్ఠానంలో ఉందని గుర్తుచేశారు. తెలంగాణ ప్రభుత్వ సలహాదారుగా శ్రీనివాస్‌రాజును నియమించడం రాజులపై ఉన్న నమ్మకం, విశ్వాసానికి ప్రతీక అన్నారు. "క్షత్రియభవన్ స్థలాన్ని మేము అందిస్తాం, భవనాన్ని మీరు నిర్మించండి మళ్లీ జరిగే సమావేశం క్షత్రియ భవన్‌లో జరుపుకుందాం" అని వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్, తెలుగు రాష్ట్రాలకు చెందిన క్షత్రియ సేవాసమితి అధ్యక్షుడు నాగరాజు, నాని, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభాస్ సినిమాపై..

విజయానికి, విశ్వాసానికి క్షత్రియులు మారుపేరని పేర్కొన్న సీఎం రేవంత్‌రెడ్డి.. ఇదే సామాజిక వర్గానికి చెందిన ప్రభాస్.. తెలుగు సినిమా ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేశారని కొనియాడారు. ప్రభాస్ కాకుండా వేరే నటుడిని బాహుబలి స్థానంలో ఊహించుకోలేమన్నారు. కర్ణాటక, తెలంగాణ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయంలో బోసురాజు కీలకపాత్ర పోషించారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా దివంగత సినీనటుడు కృష్ణంరాజుతో తనకు ఉన్న అనుబంధాన్ని రేవంత్‌రెడ్డి గుర్తుచేసుకున్నారు.

'లేటరల్ ఎంట్రీ'తో
యువతకు అన్యాయం

- ఆరెస్సెస్ ద్వారా ప్రభుత్వ ఉద్యోగుల నియామకం
- ఐఏఎస్‌ల ప్రైవేటీకరణ... రిజర్వేషన్ల అంతానికి మోదీ హామీ: రాహుల్



న్యూఢిల్లీ, ఆగస్టు 18: వివిధ మంత్రిత్వ శాఖల్లో పోస్టులను లేటరల్ ఎంట్రీ విధానంలో భర్తీ చేయాలని కేంద్రం నిర్ణయించడంపై ప్రతిపక్ష కాంగ్రెస్ తీవ్రంగా మండిపడింది. యూపీఎస్సీకి బదులు ఆరెస్సెస్ ద్వారా ప్రభుత్వ ఉద్యోగులను నియమిస్తూ రాజ్యాంగంపై ప్రధాని మోదీ దాడి చేస్తున్నారని రాహుల్ గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యల ద్వారా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లను బహిరంగంగానే లాక్కుంటున్నారని ఆయన ఆదివారం 'ఎక్స్'లో ఆరోపించారు. లేటరల్ ఎంట్రీలో ప్రభుత్వ ఉద్యోగులను నియమించుకోవడం జాతి వ్యతిరేక చర్యని ధ్వజమెత్తారు. 'అణగారిన వర్గాలకు ఉన్నత స్థానాల్లో ప్రాధాన్యం దక్కడం లేదని ఎప్పటినుంచో చెబుతున్నాం. దాన్ని మెరుగుపరచడానికి బదులు లేటరల్ ఎంట్రీ పేరుతో వారిని ఉన్నత పదవులకు మరింత దూరం చేస్తున్నారు. ఇది యూపీఎస్సీకి సిద్ధమవుతున్న ప్రతిభావంతులైన యువత హక్కులు కాలరాయడమే. అణగారిన వర్గాలకు రిజర్వేషన్లతో సహా సామాజిక న్యాయం అనే భావనపై దాడి చేస్తున్నారు. నిర్ణయాత్మక ప్రభుత్వ పదవుల్లో కూర్చోవడం ద్వారా కొన్ని కార్పొరేట్ సంస్థల ప్రతినిధులు ఏం చేస్తారో చెప్పడానికి సెబీ ఒక స్పష్టమైన ఉదాహరణ. పాలనా వ్యవస్థను, సామాజిక న్యాయాన్ని దెబ్బతీసే ఈ జాతి వ్యతిరేక చర్యను ఇండియా కూటమి తీవ్రంగా వ్యతిరేకిస్తోంది' అని రాహుల్ పేర్కొన్నారు. ఐఏఎస్‌ల ప్రైవేటీకరణ అనేది రిజర్వేషన్ల రద్దుకు మోదీ హామీ అని ఆయన దుయ్యబట్టారు.

అకోబరు 2 నుంచి ఆందోళన: అఖిలేశ్

లేటరల్ ఎంట్రీ విధానం అమలును సమాజ్‌వాదీ పార్టీ, బీఎస్పీ తప్పుబట్టాయి. బీజేపీ చేస్తున్న కుట్రకు వ్యతిరేకంగా దేశవ్యాప్త ఉద్యమం ప్రారంభించాల్సిన సమయం ఆసన్నమైందని, ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ ట్వీట్ చేశారు. దీనిపై అక్టోబరు 2నుంచి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలకు వారి కోటా ప్రకారం నియామకాలు చేపట్టకపోతే అది రాజ్యాంగ ఉల్లంఘనే అవుతుందని బీఎస్పీ అధినేత్రి మాయావతి పేర్కొన్నారు. ఈ విధానం బీజేపీ నిరంకుశత్వానికి నిదర్శనమని, ఇది రాజ్యాంగ విరుద్ధం, చట్ట వ్యతిరేకమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, వివిధ శాఖల్లోని జాయింట్ సెక్రటరీలు, డైరెక్టర్లు, డిప్యూటీ సెక్రటరీల వంటి కీలక పోస్టుల్లో 45 మందిని లేటరల్ ఎంట్రీ విధానంలో నియామకానికి యూపీఎస్సీ శనివారం దరఖాస్తులు ఆహ్వానించింది.

కమల కంటే నేనే అందంగా ఉంటా..



పెన్సిల్వేనియా, ఆగస్టు 18: అమెరికా అధ్యక్ష ఎన్నికల బరిలో ఉన్న రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ తన ప్రత్యర్థి డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి కమలా హారిస్‌పై మరోసారి నోరుపారేసుకున్నారు. పెన్సిల్వేనియాలోని విల్కేస్- బారిలో జరిగిన ఎన్నికల ప్రచారంలో ట్రంప్ మాట్లాడుతూ, కమలా హారిస్ నవ్వు భయంకరంగా ఉంటుందని, ఆమె కంటే తానే అందంగా ఉంటానని వ్యాఖ్యానించారు. టైమ్ మ్యాగజైన్ కవర్ పేజీపై కమలా హారిస్ ఫొటోను ముద్రించడాన్ని ప్రస్తావిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

గాజాపై ఇజ్రాయెల్ దాడులు ఉధృతం

గాజాస్ట్రిప్, ఆగస్టు 18: అమెరికా విదేశాంగ మంత్రి బ్లింకెన్ పర్యటన నేపథ్యంలో గాజాపై ఇజ్రాయెల్ దాడులను ఉధృతం చేసింది. శనివారం అర్ధరాత్రి నుంచి జరిగిన బాంబింగ్‌లో 19 మంది మరణించినట్లు గాజా ఆరోగ్య శాఖ తెలిపింది. కాల్పుల విరమణకు అమెరికా ప్రయత్నాల్లో భాగంగా ఆదివారం బ్లింకెన్ గాజాలో పర్యటించడానికి ముందు ఈ దాడులు జరగడం గమనార్హం! సోమవారం ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుతో బ్లింకెన్ భేటీ కానున్నారు.

బ్లింకెన్ పర్యటన వేళ..
గాజాపై ఇజ్రాయెల్ దాడులు ఉధృతం

గాజాస్ట్రిప్, ఆగస్టు 18: అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోని బ్లింకెన్ పర్యటన నేపథ్యంలో గాజాపై ఇజ్రాయెల్ దాడులను ఉధృతం చేసింది. శనివారం అర్ధరాత్రి నుంచి జరిగిన బాంబింగ్‌లో 19 మంది మరణించినట్లు గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. కాల్పుల విరమణకు అమెరికా ప్రయత్నాల్లో భాగంగా ఆదివారం బ్లింకెన్ గాజాలో పర్యటించడానికి ముందు ఈ దాడులు జరగడం గమనార్హం..! కాగా.. సోమవారం ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో బ్లింకెన్ భేటీకానున్నారు.

కోస్ట్‌గార్డ్ డీజీ రాకేష్ పాల్ హఠాన్మరణం

- సమర్థుడైన అధికారిని కోల్పోయాం: రాజ్‌నాథ్ సింగ్



రాకేష్ పాల్ (ఫైల్‌ఫొటో)

చెన్నై, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఇండియన్ కోస్ట్ గార్డ్ డైరెక్టర్ జనరల్ రాకేష్ పాల్(58) గుండెపోటుతో మరణించారు. ఆదివారం కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో పాటు కోస్ట్‌గార్డ్‌కు సంబంధించిన కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయనకు హఠాత్తుగా గుండె నొప్పి రావడంతో చెన్నైలోని రాజీవ్ గాంధీ ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. అనంతరం కొద్దిసేపటికే ఆయన మరణించారు. విషయం తెలియడంతో కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ వెంటనే ఆస్పత్రికి వెళ్లి రాకేష్ పాల్ మృతదేహానికి నివాళులర్పించారు. ఆయన అకాల మరణం పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆయన సమర్థవంతమైన, నిబద్ధతతో కూడిన అధికారి అని పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కాగా, ఐసీజీ 25వ డైరెక్టర్ జనరల్‌గా రాకేష్ పాల్ గతేడాది జూలై 19న బాధ్యతలు స్వీకరించారు. ఆయన భౌతికకాయాన్ని ఢిల్లీకి తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ఉక్రెయిన్ అణు కేంద్రానికి సమీపంలో డ్రోన్ దాడి

- ప్లాంట్ భద్రతపై అణు ఇంధన సంస్థ ఆందోళన
- ఉభయులూ సంయమనం పాటించాలని ఐఏఈఏ విజ్ఞప్తి

కీవ్, ఆగస్టు 18: ఉక్రెయిన్‌కు చెందిన అణు కేంద్రం భద్రతపై అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ(ఐఏఈఏ) ఆందోళన వ్యక్తం చేస్తోంది. ప్రస్తుతం రష్యా ఆధీనంలో ఉన్న జపోరిజియాలోని ఈ అణు కేంద్రం సమీపంలో డ్రోన్ దాడి జరగడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. ఐఏఈఏ డైరెక్టర్ జనరల్ రాఫెల్ మారియానో గ్రోసీ తెలిపిన మేరకు ఈ అణు కేంద్రం తీవ్ర ముప్పును ఎదుర్కొంటోంది. ఈ ప్లాంట్ సిబ్బంది ఉపయోగించే రోడ్డుపై ఉక్రెయినే ఈ డ్రోన్ దాడికి దిగిందని రష్యా మీడియాలో వార్తలు వెలువడ్డాయి. ప్లాంట్‌కు చెందిన కూలింగ్ స్ప్రింక్లర్స్‌కు సమీపంలో, 750 కిలోవాట్ల పవర్ లైన్‌కు కేవలం వంద మీటర్ల దూరంలో ఈ డ్రోన్ ద్వారా పేలుడు జరపడం కలవరపెడుతోందని, ఇప్పటికైనా ఉభయ పక్షాలు సమయమనం పాటించాలని గ్రోసీ విజ్ఞప్తి చేశారు. దాడి జరిగిన ప్రాంతాన్ని తమ బృందం పరిశీలించిందని, డ్రోన్ దాడిలో ఎలాంటి ప్రాణ నష్టమూ జరగలేదని, అలాగే, అణు కేంద్రానికి చెందిన పరికరాలపైనా ప్రభావమేమీ లేదని గ్రోసీ తెలిపారు. ప్లాంట్‌కు చెందిన రెండు మెయిన్ గేట్లకు మధ్య రోడ్డుపై ఈ దాడి జరిగిందని పేర్కొన్నారు. యూరప్‌లోనే అతి పెద్దదైన జపోరిజియాలోని ఈ అణు కేంద్రం ఫిబ్రవరి 2022 నుంచి రష్యా ఆధీనంలోకి వెళ్లింది.

ఫైళ్లదహనం.. వైసీపీ అక్రమాలకు నిదర్శనం

● వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు



ఎమ్మెల్యే జీవీ

వినుకొండటౌన్, ఆగస్టు 18: మదనపల్లి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో కీలక దస్త్రాల కాల్చివేత నుంచీ, ధవళేశ్వరంలో పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన పత్రాల దహనం వంటి ఘటనలు వైసీపీ ఐదేళ్ల పాలనలో జరిగిన అవినీతి, అక్రమాలకు నిదర్శనమని వినుకొండ ఎమ్మెల్యే జీవీ అంజనేయులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత పాలకుల పాపాలకు సాక్ష్యాధారాలు లేకుండా చెయ్యాలనే ఇలా బరితెగింసున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ కార్యాలయాల్లో దస్త్రాలు తగలబెట్టేస్తుండడంపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు, సంబంధిత శాఖల మంత్రులను ఆయన ఈ సందర్భంగా కోరారు. పోలవరం ప్రాజెక్టు దస్త్రాల్లో భూవ్యవహారాల్లో వారి దారుణాలు వెలుగు చూడకూడదనే వైసీపీ పెద్దలు, వారికి కొమ్ముకాస్తున్న కొందరు అధికారులు ఈ చర్యలకు పాల్పడినట్లు తెలుస్తోందన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసిత ప్రాంతాలకు సంబంధించి భూ వ్యవహారాల్లో వైసీపీ నేతలు బందిపోట్లుగా దోచేశారని, నకిలీ రైతుల పేరిట కోట్లు దండుకున్నారని వాటన్నిటినీ ఎట్టి పరిస్థితుల్లో తప్పక బయట పెడతామన్నారు. ఫైళ్ల ధ్వంసంలో ప్రమేయం ఉన్న అధికారులపైన చర్యలు తీసుకోవాలని ఇప్పటివరకు జరిగిన ఫైళ్ల దహనం కుసులన్నింటినీ ఫాస్ట్‌ట్రాక్ కోర్టుకు ఇవ్వాలని ఎమ్మెల్యే జీవీ ప్రభుత్వాన్ని కోరారు.

అన్న క్యాంటీన్‌లపై విమర్శలు హాస్యాస్పదం

● జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా దంపతులు

గుంటూరు సిటీ, ఆగస్టు 18: రాష్ట్రంలో అన్నక్యాంటీన్లను పునః ప్రారంభించి పేదలకు పట్టెడన్నం పెడుతుంటే దానిని చూసి ఓర్వలేక వైసీపీ నాయకులు చేస్తున్న విమర్శలు హాస్యాస్పదంగా ఉన్నాయని ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిసీనా, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ కత్తెర సురేష్ కుమార్‌లు ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో విమర్శించారు. కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టి నిరుపేదలకు, అనాధలకు ఆసరాలేనివారికి అన్నం పెడుతుంటే వైసీపీ నేతలు అవాకులు, చవాకులు పేలటం ఏంటని ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వ హాయంలో అన్నక్యాంటీన్లను నిర్దాక్షిణ్యంగా మూసివేసి జగన్‌మోహన్‌రెడ్డి తన రాక్షస తత్వాన్ని చాటుకున్నారని విమర్శించారు. అదే అన్నక్యాంటీన్‌లను నేడు కూటమి ప్రభుత్వం తిరిగి ప్రారంభిస్తే ప్రజల నుంచి లభిస్తున్న అభిమానాన్ని చూసి ఓర్వలేక వైసీపీ నేతలు అసూయ పడుతున్నారన్నారు. చేతనైతే అయితే పేదవారికి అన్నం పెట్టాలేగానీ, వారి నోటికాడి ముద్ద లాగేసే విధానాలను అవలంబించడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా అన్నక్యాంటీన్లపై విమర్శలు మానుకోవాలని హితవు పలికారు. గాని పెట్టే వారిని విమర్శించడం తగదని హితవు పలికారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన సాగిస్తోందన్నారు. ఇచ్చిన అన్ని పథకాలు అమలవుతాయని వాటి గురించి ప్రజలు ఆందోళన చెందవద్దన్నారు. కూటమి ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్న వైసీపీ నేతల మాటలను నమ్మవద్దని సూచించారు.

వసతిగృహ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు(విద్య),ఆగస్టు 18:మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రీ, పోస్టుమెట్రిక్ బాలికల వసతి గృహాల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమశాఖాధికారి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రీమెట్రిక్ మైనార్టీ వసతిగృహం గుంటూరు రవీంద్రనగర్ 1వలైనులో, పోస్టుమెట్రిక్ బాలకల వసతిగృహం పొన్నూరు రోడ్డులోని ఆనందపేటలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హాస్టల్స్‌లో వసతి పొందాలనుకునేవారు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్‌ను సంప్రదించాలని (9392105096, 8804422522) కోరారు.

విద్యార్థినులు ఒత్తిళ్లకు తలొగ్గొద్దు



విద్యార్థినికి ఉపకార వేతనాల చెక్కు అందజేస్తున్న మంత్రి పెమ్మసాని

● కోల్‌కతా ఘటనలు పునరావృత్తం కాకూడదు
● మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి
● కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థినిలు ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గొద్దని, కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై జరిగిన ఘటన మరోసారి పునరావృతం కాకూడదని గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరులోని కమ్మ జన సేవా సమితి ఆధ్వర్యంలో చేతన్ ఫౌండేషన్, రోటరీ క్లబ్ సంయుక్త నేతృత్వంలో ఆదివారం జరిగిన విద్యార్థినులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ, దివ్యాంగులకు కృత్రిమ అవయవాల అందజేత కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పెమ్మసాని మాట్లాడుతూ విద్యార్థినులు ఎవరో చెప్పారనో, ఒత్తిడి చేశారనో తమ నిర్ణయాలను మార్చుకో వాల్సిన అవసరంలేదని, ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని, భవిష్యత్తుకు సంబంధించిన నిర్ణయాలు తీసుకునే సమయంలో తొందరపడొద్దని, మహిళలు ఎదుటి వ్యక్తులకు స్ఫూర్తిగా ఉండాలని సూచించారు. కోల్‌కతాలో జరిగిన ఘటనలు పునరావృత్తం కాకుండా చర్యలు తీసు కోవాలన్నారు. అనంతరం 180 మంది విద్యార్థినులకు ఒక్కొక్కరికి రూ.10 వేలు, రూ.15 వేలు చొప్పున స్కాలర్‌షిప్పులు అందజేశారు. అలాగే దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను, పలువురికి కుట్టుమిషన్లు, గ్రైండర్లు, తోపుడు బండ్లను పెమ్మసాని పంపిణీ చేశారు. కార్యక్రమంలో చేతన గ్లోబల్ ఫౌండేషన్ చైర్మన్ వెనిగళ్ళ రవికుమార్, బెటర్ వాషింగ్టన్, లామ్ శ్రీకృష్ణ, మజ్జిగ కేశవ కిషోర్ కుమార్, కమ్మ జనసేవా సమితి సెక్రటరీ చుక్కపల్లి రమేష్, రోటరీ క్లబ్ గుంటూరుసెంటెన్నియల్ ప్రెసిడెంట్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఆత్మసంతృప్తి కోసం సేవ చేస్తున్న లయన్స్ క్లబ్

ఆత్మ సంతృప్తి కోసం సేవ చేసేందుకు ఏర్పడిన సంస్థ లయన్స్ క్లబ్ అని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరం ప్రాంగణంలో ఆదివారం జరిగిన లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ మెగా సేవ మహోత్సవం కార్యక్రమంలో ఆయన విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో మహిళలకి 100 కుట్టుమిషన్లు, 50 గ్రైండర్లతో పాటు ఇతర పనిముట్లను ఆయన అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ చిగురుపాటి వరప్రసాద్, ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ, టీడీపీ సీనియర్ నేత ఉగ్గిరాల సీతారామయ్య, కార్పొరేటర్ పోతురాజు సమతతో పాటు లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ పి.గోపీచంద్, పీఐడీ ట్రస్టీ వీ.విజయకుమార్ రాజు, క్లబ్ అంతర్జాతీయ మాజీ డైరెక్టర్ కె వంశీధర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

అదనం పేరుతో నిధులు స్వాహా

● సెక్యూరిటీ గార్డులకు బస్‌చార్జీలు పేరుతో రూ. వేలు
● క్యాజువల్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకూ అంతే..
● ఏఎన్‌యూలో దుర్వినియోగంపై విమర్శలు
● విచారణతోనే వాస్తవాలు వెలుగులోకి..

గుంటూరు(విద్య), ఆగస్టు 18: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో అదనపు పారితోషకాల పేరుతో నిధులు దుర్వినియోగం అవుతున్నాయనే విషయంపై ఆరోపణలు వస్తున్నాయి. ఉన్నతాధికారులు కొందరు సిబ్బందికి అదనపు పారితోషకం పేరుతో నిధులను దోచి పెడుతున్నారు. నియామకం చేసుకున్న సిబ్బంది చేత పని వేళలో నిబంధనల ప్రకారం పనిచేయించుకుని వేతనాలు మాత్రమే ఇవ్వాలి. కానీ మాజీ ఉన్నతాధికారులు కొందరు సెక్యూరిటీ గార్డులు, కాజువల్ వర్కర్లపై అమితమైన ప్రేమ చూపి, వారికి వేతనాలతో పాటు బస్సు చార్జీలు, అదనపు పారితోషకం వంటి పేర్లతో ప్రతినెల వేలాది రూపాయలు ముట్టచెప్పారు. దీంతో ఆయా సిబ్బంది ప్రతి నెల వేతనంతో పాటు అదనపు నగదు పొందుతూ జేబులు నింపుకుంటున్నారు. రాష్ట్రంలో కొత్తగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైసీపీ ప్రభుత్వంలో నియమితులైన ఉన్నతాధికారులు రాజీనామా చేయడంతో వారి స్థానంలో నూతన ఉన్నతాధికారులు నియమితులైనారు. వారుకూడా ఈ విషయపై దృష్టిసారించకపోవడంతో వర్సిటీ నిధులు కరిగిపోతున్నాయి.

విజయవాడలో ఉంటున్న మాజీ ఉపకులపతి క్యాంపు కార్యాలయం వద్ద పనిచేసిన సెక్యూరిటీ గార్డులకు బస్ చార్జీలు లోకల్ కన్వీనియన్స్ చార్జీలు కింద ఈఏడాది జూన్ (వేతనాలు కాకుండ) రూ.11,254 చెల్లించారు. అలాగే 5 అవుట్‌సోర్సింగ్, కాజువల్ వర్కర్లకు ఈ ఏడాది జూన్‌కు అదనపు పారితోషకం పేరుతో రూ.42,176 చెల్లించారు. మరో జీపు డ్రైవరుకు అదనపు పారితోషకం పేరుతో ఈ ఏడాది జూన్ రూ.29,800 చెల్లించారు. విశ్వవిద్యాలయం ఇంజనీరు కార్యాలయంలో రోజువారి ఉద్యోగులుగా పనిచేసిన ముగ్గురికి ఈ ఏడాది మేలో రూ.38,700 అదనపు పారి తోషకం చెల్లించారు. ఇలా దోపిడీ కొన్నేళ్లక్రితం ప్రారంభమై నేటికీ యథేచ్ఛగా కొనసాగుతోంది. ప్రస్తుత ఉన్నతాధికారులు కూడా ఈ అదనపు బిల్లులు మంజూరు చేయటంపై తీవ్ర విమర్శలు వ్యక్తమ వుతున్నాయి. ఇప్పటికైనా విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు ఈదోపిడీపై విచారణకు ఆదేశిస్తే వాస్తవాలు వెలుగుచూసే అవకాశం ఉంది.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

దుర్గి, ఆగస్టు 18: మండల కేంద్రమైన దుర్గిలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ధర్మవరంకు చెందిన షేక్ లాలు (50) దుర్గి నుంచి ధర్మవరంకు శనివారం రాత్రి నడిచి వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన మన్నీడి కృష్ణ ఆటోలో ధర్మవరం వెళ్తూ ఢీ కొట్టాడు. ఈ సంఘటనలో లాలు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుమారుడు సైదావలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అలాగే ప్రకాశంజిల్లా యర్రగొండపాలెం మండలం వెంకటాద్రి గ్రామానికి చెందిన కంచెపోగు వెంకటేశ్వర్లు(36) కూలీపనుల కోసంవచ్చి దుర్గి శివారు ప్రాంతంలో నివాసముంటున్నాడు. ఆది వారం వివిధ పనుల నిమిత్తం దుర్గి సెంటర్‌కు వచ్చి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా వాహనం అదుపు తప్పటంతో కింద పడిపోయాడు. తీవ్ర గాయాలతో పడి ఉన్న అతడిని కారంపూడి నుంచి వస్తున్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, ఎస్ఐ సుధీర్‌కుమార్‌లు గమనించారు. క్షతగాత్రుడు వెంకటేశ్వర్లుని ఎస్ఐ తన వాహనంలో మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు.

న్యాయాధికారుల సంఘం

రాష్ట్ర అధ్యక్షుడిగా చక్రపాణి



జీ.చక్రపాణి



టీ. లీలావతి

గుంటూరు(లీగల్),ఆగస్టు 18: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయాధికా రుల సంఘం అధ్యక్షుడిగా జీ. చక్రపాణి ఎన్నికయ్యారు. ఆదివారం విజయవాడలోని భూ సమీకరణల ప్రత్యేక న్యాయస్థానంలో రాష్ట్ర న్యాయాధికారుల సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో నూతన కార్యవర్గానికి ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో 521 మంది న్యాయాధికారులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.న్యాయాధికారుల సంఘం రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా ప్రస్తుతం గుంటూరు ఫ్యామిలీ కోర్టులో అదనపు జిల్లా జడ్జిగా పనిచేస్తున్న జీ.చక్రపాణి ఎన్నికయ్యారు. గుంటూరుజిల్లా న్యాయ సేవాధికారసంస్థ కార్యదర్శిగా పనిచేస్తున్న టీ.లీలావతి, హిందూ పూర్ 2వ అదనపు జిల్లా జడ్జి కే.శైలజ, సోంపేట సీనియర్ సివిల్‌జడ్జి జే.శ్రీనివాసరావులు ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యారు, కాకినాడ సీనియర్ సివిల్ జడ్జి నంబళ్ల రమేష్‌నాయుడు జనరల్ సెక్రటరీ, ట్రెజరర్‌గా ఎన్నికయ్యారు. విశాఖపట్నం సీనియర్ సివిల్‌జడ్జి ఎం.ప్రదీప్ కుమార్, 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి జీ.కార్తీక్, రాజమండ్రి అడిషనల్ జూనియర్ సివిల్‌జడ్జి ఏ.కృష్ణప్రసాద్‌లు జాయింట్ సెక్రటరీలుగా ఎన్నిక య్యారు. కర్నూలు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బీ.లీలా వెంకటశేషాద్రి, చిత్తూరు అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌పీడీ వెన్నెల, నంద్యాల అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి బీ.రాధారాణి, విజయవాడ 4వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి డాక్టర్ సీహెచ్. శ్రీనివాసబాబులు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. విశ్రాంత జిల్లా జడ్జి, ప్రస్తుత హైకోర్టు న్యాయవాది విరూపాక్ష దత్తాత్రేయ గౌడ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కోసం

22 లోగా దరఖాస్తు చేసుకోవాలి

గుంటూరు(విద్య), ఆగస్టు 18: ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కోసం ఈనెల 22లోగా దరఖాస్తుచేసుకోవాలని గుంటూరుజిల్లా విద్యాశాఖ అధికారి పీ. శైలజ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉపాధ్యాయులు,హెచ్‌ఎంలు వారి దరఖాస్తులను 22వ తేది నాటికి ఎంఈవోలకు అందజేయాలని, ఎంఈవోలు వాటిని పరిశీలించి 24న జిల్లా ఉప విద్యాశాఖాధికారికి అందజేస్తారని, వారు వాటిని 27వ తేదీన జిల్లా విద్యాశాఖకు అందజేయాలని సూచించారు. దరఖాస్తుదారులు కనీసం 15 ఏళ్ల సర్వీస్ ఉండాలని, ఎటువంటి క్రమశిక్షణా చర్యలకులోనై ఉండరాదని స్పష్టం చేశారు.

గంజాయి తరలిస్తున్న యువకుల అరెస్టు

బాపట్ల,ఆగస్టు18: బాపట్ల పట్టణంలోని ఉప్పరపాలెంలో ఆదివారం గంజాయితో వెళుతున్న ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకొని వారివద్ద 400గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సీఐ ఆర్.అహ్మద్‌జానీ తెలిపారు. బాపట్ల రైల్వే స్టేషన్‌లో రైలు దిగిన ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై గంజాయితో వెళుతున్నట్లు తమకు సమాచారం రాగా తహసీల్దార్ శ్రీదేవి, పోలీసు సిబ్బందితో ఆ యువకులను అదుపు లోకి తీసుకున్నామన్నారు. వారివద్ద చిన్న పొట్లాల్లోవున్న గంజాయి ని స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుల్లో ఒకరు బాపట్ల పట్టణం క్రిస్టియన్‌పేటకు చెందిన బెజ్జం సువర్ణరాజు, మరొకరు న్యూఎండ్ల మండలం జంగాలపల్లి గ్రామానికి చెందిన వల్లెపు చాణిక్యగా గుర్తించామన్నారు. వీరిద్దరూ వైజాగ్‌లో చదువుకుంటూ గంజాయి రవానాకు పాల్పడుతున్నారన్నారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.



రెండు క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు


రెండు క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల

మాచర్ల రూరల్, ఆగస్టు 18: నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ అధికారులు ఆదివారం ప్రాజెక్ట్ రెండు క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేశారు. రెండు గేట్లను 8 అడుగుల మేర ఎత్తి 24,920 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలో పూర్తి స్థాయి నీటిమట్టం 590.00 అడుగులు ఉంది. ఇది 312.04 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 8067 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 6791 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,273 క్యూసెక్కులు, రెండు క్రస్ట్ గేట్ల ద్వారా 24,920, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కులు, ఎల్ఎల్‌సీ ద్వారా 600 క్యూసెక్కులు, మొత్తం అవుట్‌ఫ్లో 71,451 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 71,451 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతలకు 55 వేల క్యూసెక్కులు..

● టెయిల్‌పాండ్ ప్రాజెక్టులో 1.02 ఎంయుల విద్యుదుత్పత్తి

రెంటచింతల,ఆగస్టు 18: సత్రశాల వద్ద కృష్ణానదిపై నిర్మించిన నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు చెందిన 5 క్రస్ట్ గేట్లను 2 మీటర్ల ఎత్తి 46,236 క్యూసెక్కులు,విద్యుదుత్పత్తి అనంతరం టేల్ రేస్ ఛానల్ ద్వారా 8764 మొత్తం 55 వేల క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నట్లు ఎస్‌ఈ కే.వెంకటరమణ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం అర్ధరాత్రి 12 గంటల వరకు రెండు యూనిట్ల ద్వారా 1.02 ఎంయూల విద్యుత్ తయారైందన్నారు. రిజర్వాయర్‌లో 75.40 మీటర్ల మేర నీరుండగా ఈ నీరు 7 టీఎంసీలకు సమానమన్నారు. ఎగువన వున్న సాగర్ నుంచి 54 వేల క్యూసెక్కులు రిజర్వాయర్‌కు వస్తుందన్నారు.



ప్రకాశం బ్యారేజి నుండి దిగువకు విడుదల అవుతున్న వరదనీరు

ప్రకాశం బ్యారేజీ నుంచి నీరు విడుదల

తాడేపల్లి టౌన్, ఆగస్టు 18: ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి నుండి దిగువకు నీటిని విడుదల కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు నుండి 52 వేలు, కీసర వాగు నుండి 2వేల క్యూసెక్కుల వంతున మొత్తం 54 వేల క్యూసెక్కుల వరద నీరు ఆదివారం ప్రకాశం బ్యారేజి వద్దకు చేరుతున్నట్టు నీటిపారుదల శాఖ జేఈ దినేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా 50 గేట్లను 1 అడుగు వంతున ఎత్తి దిగువకు 36 వేల 500 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అలాగే తూర్పు, పశ్చిమ డెల్టా కాలువలకు 17వేల 400 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్టు జేఈ తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



రైతు వెంకటేశ్వర్లు మృతదేహం

బొల్లాపల్లి, ఆగస్టు 18: రేమిడిచర్ల గ్రామానికి చెందిన మోటపోతుల వెంకటేశ్వర్లు(64) అనే రైతు అప్పుల బాధ తాళలేక శనివారం రాత్రి పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ బాలక్రిష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటేశ్వర్లు గత నాలుగైదు సంవత్సరాల్లో తనకు ఉన్న సొంత పొలం నాలుగు ఎకరాలతో పాటు మరో ఆరు ఎకరాలు కౌలుకు తీసుకొని సాగు చేశాడు. పెట్టుబడి కోసం అప్పులు చేశాడు. పంట దిగుబడి, మార్కెట్‌లో రేటు విషయంలో ప్రతి ఏటా నష్టాలనే చవిచూశాడు. ఈక్రమంలో రూ.15 లక్షల వరకు అప్పులయ్యాయి. దీంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. శనివారం రాత్రి డాబాపైకి పడుకొన్నాడు. ఉదయం ఎంతసేప టికీ కిందికి రాకపోవడంతో కుటుంబ సభ్యులకు పైకి వెళ్ళగా అతని పక్కనే పురుగు మందు పెట్టుకొని ఉండటం చూసి వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికి మృతి చెందాడని డాక్టర్లు నిర్ధారించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనస్థలానికి వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం వినుకొండ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. ఎస్ఐ ఏ.బాలకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. వెంకటేశ్వర్లుకు భార్య సుందరమ్మ, కుమారుడు, ఇద్దరు కుమర్తెలు ఉన్నారు.

వైద్యుల రక్షణకు కఠిన చట్టాలు చేయాలి

● ఆస్పత్రులను సురక్షిత ప్రాంతాలుగా ప్రకటించాలి
● కేంద్ర మంత్రి జేపీ నడ్డాకు ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు లేఖ



ఎంపీ లావు

గుంటూరు (మెడికల్) ఆగస్టు 18: కేంద్ర ప్రభుత్వం కఠినచట్టాలు రూపొందించి వైద్యులు, ఆస్పత్రుల రక్షణపై నమ్మకం కలిగించాలని ఎంపీ, లోక్‌సభ టీడీపీ ఫ్లోర్‌లీడర్ లావు శ్రీకృష్ణదేవరాయలు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు కేంద్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ మంత్రి జేపీ నడ్డాకు ఆయన లేఖ రాశారు. కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ వైద్య కళాశాల ఆస్పత్రిలో ట్రైనీ పీజీ విద్యార్థిని అత్యాచారం, హత్య ఘటన హృదయాన్ని కలచి వేసిందని ఎంపీ పేర్కొన్నారు. కొంతకాలం గా దేశవ్యాప్తంగా వైద్యులపై, ఆస్పత్రులపై దాడులు పెరుగుతున్నాయని, వైద్యుల రక్షణకు కేంద్ర ప్రభుత్వం కఠినచట్టాలు అమలుచేయాల్సిన ఆవశ్యక తను కోల్‌కతా దారుణ ఘటన మరోసారి గుర్తు చేసిందన్నారు. ఆస్పత్రులను సురక్షిత ప్రాంతాలుగా ప్రకటించాలని కోరారు. వైద్యులపై, ఆసుపత్రులపై దాడులు దిగే వారిపై నాన్ బెయిల్‌బుల్ సెక్షన్‌లు అమలు చేయడంతో పాటు భారీగా జరిమానా విధించాలని సూచించారు. రోగులకు వైద్యపరమైన ఇబ్బందులు ఎదురైతే తెలుసుకొనేందుకు ప్రతి ఆస్పత్రిలో ఫిర్యాదుల విభాగం ఏర్పాటు చేయాలన్నారు. చికిత్స విషయంలో వైద్య సంబంధమైన ఘర్షణలు చెలరేగినప్పుడు రోగుల తరపున ప్రభుత్వపరంగా లభించే చట్టపరమైన సాయం వివరాలను ప్రజలందరికి తెలిసేలా తగిన ప్రచారంచేయాలని కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డాకు ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు విజ్ఞప్తి చేశారు.



శిక్షణ తరగతుల్లో పరికరాల తయారీ, వినియోగం గురించి వివరిస్తున్న నిపుణులు

విపత్తుల సమయంలో

హామ్ రేడియోదే కీలక భూమిక

● అమెచ్యూర్ రేడియో ఔత్సాహికుల సాధికారత సదస్సులో వక్తలు

గుంటూరు, ఆగస్టు18(ఆంధ్రజ్యోతి): ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు ప్రజలకు అవసరమైన సమాచారాన్ని చేరవేయడంలో హామ్ రేడియోదే కీలకపాత్ర అని పలువురు వక్తలు స్పష్టం చేశారు. ఇటీవల కేరళ రాష్ట్రంలోని వయనాడ్‌లో జరిగిన విపత్తు సమయంలో హామ్ రేడియో అందించిన సేవలు అమూల్యమైనవని చెప్పారు. ఆదివారం గుంటూరు జిల్లా పెదకాకానిలోని అమెచ్యూర్ రేడియో కమ్యూనిటీలో కొత్తగా ఈ రంగంలోకి కోర్సులు పూర్తిచేసుకొని వచ్చిన ఔత్సాహికులకు ఒక్కరోజు శిక్షణ తరగతులను నిర్వహించారు. హామ్ రేడియోలో బేసిక్స్ పరికరాల తయారీ, వాటిని ఏర్పాటు చేయడం, వినియోగించడం, యాంటెనా థియరీ, నిర్మాణం, గజిట్‌లో ముసాంఐదా సవరణల గురించి వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి విజయవాడ నుంచి వైర్‌లెస్ మానిటరింగ్ స్టేషన్ అధికారులు అభిషేక్ కుమార్ (ముఖ్య అతిథి), బంగార్రాజు, పద్మజ అతిథులుగా హాజరై అత్యవసర సమాచార, కమ్యూనిటీ నిర్మాణంలో హామ్ రేడియోల ప్రాముఖ్యత గురించి వివరించారు. వీరితో పాటు అసిస్టెంట్ కమిషనర్ పీ దిగ్విజయం, విశ్రాంత డీఈవో టీ ఆర్ జయచందర్ కూడా తమ అనుభవాలను వివరించారు. అనిల్, వినయ్ ప్రాక్టికల్ ట్రైనింగ్ సెషన్స్‌ని నిర్వహించారు. వీహెచ్‌ఎఫ్, హెచ్‌ఎఫ్ యాంటెనాలు గురించి విశ్లేషించారు. అమేయ అమెచ్యూర్ రేడియో అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిక్షణ తరగతుల్లో అధ్యక్షుడు ఏ వీ సత్యన్నారాయణ, సెక్రెటరీ బోయపాటి వెంకటరమణ, కోశాధికారి ఎన్ లక్ష్మీకాంత్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి వై.వెంకటేశ్వరరావు, సలహాదారు, జీసీ మెంబర్ రాయప్రోలు శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అన్న అంత్యక్రియలకు వచ్చి తమ్ముడు మృతి

● ప్రమాదవశాత్తు కాల్వలోకి జారిపడి గుర్రపుడెక్కలో చిక్కుకొని..

చేబ్రోలు, ఆగస్టు18: అన్న అంత్య క్రియలకు వచ్చి ప్రమాదవశాత్తు కాలు జారి కాల్వలో పడి తమ్ముడు మృతి చెందిన సంఘటన ఆదివారం చేబ్రోలులో చోటు చేసుకుంది. చేబ్రోలు ఎస్ఐ వెంకట కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని వడ్లమూడి గ్రామానికి చెందిన రామయ్య మృతి చెందగా ఆదివారం అతడి అంత్య క్రియలు జరిగాయి. ఈ కార్యక్రమానిక రామయ్య సోదరుడు పెదనందిపాడు మండలం నాగులపాడుకు చెందిన పాలపర్తి కృష్ణ (54) విచ్చేసాడు. రామయ్య అంత్యక్రియలు పూర్తి అయిన తర్వాత బంధువులు అందరూ కలిసి సమీపంలోని అప్పాపురం కాల్వలోకి స్నానాల కోసం దిగారు. కాల్వ గట్టుపై ఉన్న కృష్ణ కాలు జారీ కాల్వలో పడి గల్లంతైయాడు. బంధువులు గాలించగా సమీపంలోనే కాల్వలోవున్న తూటి కాడ గుర్రపు డెక్కలో చిక్కుకొని కృష్ణ మృతి చెంది ఉన్నాడు. మృతుడి కుమారుడు నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కృష్ణ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



లాంచీల ద్వారా కొండకు చేరుకుంటున్న పర్యాటకులు

నాగార్జునకొండలో పర్యాటకుల సందడి

మాచర్ల రూరల్, ఆగస్టు 16: ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జున కొండను ఆదివారం పర్యాటకులు భారీగా సందర్శించారు. లాంచీ స్టేషన్ నుంచి నాగార్జున కొండకు వివిధ లాంచీలలో చేరుకున్నారు. కొండపై మ్యూజియంలోని బుద్ధుని ప్రతిమలు, రాతిపనిముట్లు, మట్టికుండలు, బుద్ధుని పాలరాతి విగ్రహం, మహాస్థూపం, స్నానాలఘాట్, బోధివృక్షం వంటి వాటిని తిలకించారు. అనంతరం అనుపులో యాంపీ స్టేడియం, అశ్వ మేధ యజ్ఞశాల, శ్రీరంగనాథస్వామి దేవాలయం, ఎత్తిపోతల జలపాతాన్ని వీక్షించారు. పర్యాటకులు భారీగా సందర్శించడంతో లాంచీ స్టేషన్‌కి రూ. 93 వేల ఆదాయం సమకూరినట్లు లాంచీ యూనిట్ అధికారులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

పిడుగురాళ్ల,ఆగస్టు18: పిడుగురాళ్ల మండలం తుమ్మలచెరువు గ్రామంలో మహిళ అనుమానస్పద స్థితిలో మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తుమ్మలచెరువు గ్రామానికి చెందిన నల్ల మేకల సైదమ్మ(55) ప్రతి రోజు లాగే ఆదివారమూ గేదెను మేతకు తోలుకొని పోయింది. అయితే సాయంత్రానికి ఆమె ఇంటికి తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలాల వైపు వెళ్లి పరిశీలించి చూడగా పత్తి పొలంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉండటాన్ని గుర్తించారు. వెంటనే పిడుగురాళ్ల పోలీసులకు సమాచారం అందించగా ఎస్ఐ మోహన్ ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతురాలు గొంతుపై కర్రతో బలంగా నొక్కి ఉన్నట్లు ఉండటంతో సైదమ్మ ది హత్యగానే పోలీసులు భావిస్తున్నారు. పోలీసులు కుటుంబ సభ్యుల నుంచి వివరాలు తీసుకుంటున్నారు. సైదమ్మ కుటుంబ సభ్యుల నుంచి అందిన ఫిర్యాదు మేరకు అన్ని కోణాలలో విచారణ చేస్తామని ఎస్ఐ మోహన్ ఈ సందర్భంగా తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.01 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & బ్రీడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	116, 124,135
చికెన్ విత్ స్కిన్	218.00
చికెన్ స్కిన్ లెస్	228.00

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె




సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ తుషార్ డూడీ, పాల్గొన్న ఎస్బీ విభాగం పోలీసులు

అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉండాలి : ఎస్పీ

బాపట్ల, ఆగస్టు 18 : గంజాయి, జూదం ఇతర అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని స్పెషల్ బ్రాంచ్ పోలీసులకు ఎస్పీ తుషార్ డూడీ సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఆదివారం ఎస్బీ విభాగం పోలీసులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ ముందస్తు సమాచారంతో నేరాలను సమర్థవంతంగా నియంత్రించవచ్చని చెప్పారు. అన్ని వర్గాల వారితో మమేకమై అత్యంత వేగంగా సమాచారం సేకరించాలన్నారు. జిల్లా పోలీసు శాఖ సమర్థవంతంగా విధులు నిర్వహించేందుకు, అసాంఘిక కార్యకలాపాలు కట్టడి చేయటానికి ముందస్తు సమాచారం సేకరించటం కీలకమని ఎస్పీ తెలిపారు. నిత్యం ప్రజలతో మమేకమై జిల్లాలో జరుగుతున్న సమాచారాన్ని ముందస్తుగా సేకరించాలన్నారు. ఏమైన శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఘటనలు చోటు చేసుకునే అవకాశం ఉంటే త్వరితగతిన ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. ఎక్కడైనా పేకాట, కోడిపందాలు వంటి అసాంఘిక కార్యకలాపాలు గురించిన ముందస్తు సమాచారం ఉన్నతాధికారులకు అందించాలన్నారు. ప్రతి ఒక్కరూ నిబద్ధతతో, అంకితభావంతో విధులు నిర్వహించాలన్నారు. విధులలో నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించినా, నిగూఢ రహస్య సమాచారం సేకరించటంలో అలసత్వం ప్రదర్శించినా శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో మాదకద్రవ్యాలు, అసాంఘిక కార్యకలాపాలు వంటి వాటి మీద నిఘా ఉంచటం జరిగిందన్నారు. ప్రజలు కూడా సహకరించి వారి ప్రాంతాలలో ఏవైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే కార్యక్రమాలు జరుగుతుంటే వెంటనే స్థానిక పోలీసుస్టేషన్‌లో కాని 100, 112 నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచుతామని ఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో ఎస్బి ఇన్‌చార్జి సీఐ బాలమురళీకృష్ణ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యువత క్రీడాస్ఫూర్తిని పెంపొందించుకోవాలి

● మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ నాయకుడు అన్నం సతీష్ ప్రభాకర్

బాపట్ల, ఆగస్టు 18 : యువత క్రీడాస్ఫూర్తిని పెంపొందించుకోవాలని మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ నాయకుడు అన్నం సతీష్ ప్రభాకర్ పిలుపునిచ్చారు. జాతీయ క్రీడాకారుడు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత ఎస్ఎస్ శ్యామ్ జ్ఞాపకార్థంగా ఆదివారం బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల గ్రౌండ్‌లో క్రికెట్ అసోసియేషన్ సభ్యులకు క్రీడాదుస్తుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గంటా అంజిబాబు సమకూర్చిన క్రీడా దుస్తులను అన్నం సతీష్ చేతుల మీదగా క్రీడాకారులకు పంపిణీ చేశారు. ముందుగా ఎస్ఎస్ శ్యామ్ పటానికి పుష్పాంజలి ఘటించి అక్కడ జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అథ్లెటిక్స్‌లో అనేక పతకాలు సాధించటమే కాకుండా బాపట్ల కీర్తిని దశదిశలా వ్యాపింప చేసిన శ్యామ్‌ను స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరు క్రీడలలో రాణించాలని చెప్పారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గంటా అంజిబాబు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం క్రికెట్ అసోసియేషన్‌లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఐదుగురికి ఒక్కొక్కరికి రూ.5వేలు చొప్పున రూ.25 వేలు అందజేస్తానని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీనారాయణ, యువమోర్చా రాష్ట్ర కోశాధికారి బి.కృష్ణచైతన్య, టీడీపీ సీనియర్ నాయకుడు తానికొండ దయాబాబు, జీకే నాయుడు, దొప్పలపూడి రామ్మోహనరావు, నజీర్, ఇమామ్, రఘు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు దోనేపూడి దేవరాజు, మాజీ కౌన్సిలర్ బక్కా రోశయ్య, శీలం సాగర్, చింతా బాబురావు, పెరికల జోసఫ్, గుడ్డె శ్రీను పాల్గొన్నారు.



జాతీయ క్రీడాకారుడు ఎస్ఎస్ శ్యామ్ పటానికి పుష్పాంజలి ఘటిస్తున్న మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గంటా అంజిబాబు తదితరులు

పొగాకు రహిత సమాజ స్థాపన విద్యార్థుల లక్ష్యం కావాలి

● అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రసూన రాణి

బాపట్ల, ఆగస్టు 18 : పొగాకు రహిత సమాజ స్థాపన విద్యార్థుల లక్ష్యం కావాలని బాపట్ల వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రసూన రాణి కోరారు. కళాశాలలో ఆదివారం టుబాకో ఫ్రీయూత్ 2.0 కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి అసోసియేట్ డీన్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ విద్యార్థి దశ అత్యంత కీలకమైనదని, ఈ వయసులో విద్యార్థులు వివేకంతో మెలగాలని, వ్యసనాలకు బానిసలు కాకుండా జాగ్రత్తపడాలని తెలిపారు. టుబాకో సంబంధిత పదార్థాలను వాడరాదని, సరదాగా ప్రారంభమైన వ్యసనం ప్రాణాంతకం అవుతుందని హెచ్చరించారు. పొగాకు పదార్థాలపై అప్రమత్తంగా ఉంటామని, ఎట్టి పరిస్థితులలో వాటిని వినియోగించమని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ కాట్రగడ్డ శ్రీనివాసరావు, డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, డాక్టర్ కె.విజయప్రకాష్, డాక్టర్ ఎం.సంధ్య, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రసూన రాణి

భరతమాత ముద్దుబిడ్డ నేతాజి

బాపట్ల, ఆగస్టు 18 : 1943లోనే స్వతంత్రభారత ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన ధీశాలి నేతాజి సుభాష్‌చంద్రబోస్ అని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు అన్నారు. నేతాజి 80వ వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించి అక్కడ జరిగిన సమావేశంలో డాక్టర్ సాయిబాబు మాట్లాడుతూ నాడు భారతసైన్యాన్ని కూడా నేతాజి నిర్మాణం చేశారన్నారు. దేశ, విదేశాల మద్దతు కూడగట్టి భరతమాత దాస్యవిముక్తి కోసం పోరాటం చేశారన్నారు. ఆయన అనేక దేశాలు సందర్శించి వారి మద్దతుతో దేశ స్వాతంత్ర్యం కోసం అహర్నిశలు శ్రమించారన్నారు. ఈ కార్యక్రమంలో సి.హెచ్.శ్రీధర్, చీరాల వెంకటేశ్వరరెడ్డి, కాగిత కోటేశ్వరరావు, నర్రా సాంబు, సురేష్, హర్ష పాల్గొన్నారు.



నేతాజి సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న డాక్టర్ సాయిబాబు తదితరులు

నిరుపేద కుటుంబాలకు అండగా ఉంటాం

● ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు గోపి

బాపట్ల,ఆగస్టు 18 : నిరుపేద కుటుంబాలకు అన్నివిధాలా అండగా ఉంటామని ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు బండ్రెడ్డి గోపి తెలిపారు. పట్టణంలోని 3వవార్డు రాజీవ్‌గాంధీకాలనీలోని గిరిజన కుటుంబాలవారికి, డంపింగ్ యార్డు పరిసరాలలో నివాసం ఉంటున్న యానాదులకు ఆదివారం నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఆర్గనైజేషన్ రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సురేష్, కోశాధికారి సువర్ణరాజు, గౌరవాధ్యక్షుడు శ్రీనివాసరావు, సభ్యులు అమ్మయ్య, లక్ష్మణరావు, సురేష్, రాజారమేష్, పాపాయి, నాగరాజు, సుభానీ, అశోక్‌కుమార్, గోపి, శ్రీనివాసరావు, కోటేశ్వరరరావు తదితరులు పాల్గొన్నారు.

మురుగునీరు పోయేదారేది..?

● పారిశుధ్య పనులు పర్యవేక్షించని అధికారులు
● శివారు కాలనీల్లో స్వైరవిహారం చేస్తున్న పందులు
● రోగాలబారిన పడుతున్న ప్రజలు



బాపట్ల విద్యుత్ డివిజన్ కార్యాలయం ఎదుట జీబీసీ రోడ్డుపై నిలిచిన మురుగునీరు

బాపట్ల, ఆగస్టు 18 : పట్టణంలో అధికారులు వంద రోజుల ప్రణాళికతో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. కేవలం మేజర్ డ్రెయిన్‌లలో సిల్ట్ తొలగించటం, ప్రతిరోజు చెత్తాచెదారం డంపింగ్ యార్డుకు తరలించటం వంటి పనులతోనే సరిపెట్టుకుంటున్నారు. శాశ్వతప్రాతిపదికన పారిశుధ్య పనులు నిర్వహించటంలేదనే విమర్శలు సర్వత్రా వ్యక్తమౌతున్నాయి. దీనికితోడు సీజనల్ వ్యాధులు వ్యాపించి ఆసుపత్రుల చుట్టూ అనేకమంది తిరుగుతున్నారు. కేవలం దోమల వ్యాప్తి, మురుగు, పందుల స్వైరవిహారం వల్లే ఈ విధంగా సమస్యలు తలెత్తుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. రోజుకోక వార్డు తిరిగే అధికారులు ఆ వార్డులో సమస్యలను గుర్తించి సచివాలయ సిబ్బందికి, పర్యవేక్షణాధికారులకు అప్పజెప్పి వెళ్ళిపోతున్నారు. ఆ తర్వాత క్షేత్రస్థాయిలో ఏ మేరకు పనులు జరుగుతున్నాయో పట్టించుకోవటంలేదనే విమర్శలు వస్తున్నాయి. ముఖ్యంగా ఖాళీ స్థలాలలో పెరిగిపోయిన ముళ్ళచెట్లు, పిచ్చిమొక్కలు, పొదలు తొలగించటంలో విఫలమయ్యారు. దీనివల్ల వర్షపునీరు ఆ ప్రాంతాలలో నిలిచి విషపురుగులు సంచరించటానికి, దోమలవ్యాప్తికి కారణమౌతున్నాయి. శివారు కాలనీలలో పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో అంటువ్యాధులు ఎక్కడ వ్యాపిస్తాయోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. కోట్లరూపాయలు వెచ్చించి బాపట్ల మార్కెట్ యార్డు దగ్గర నుంచి ఇంజనీరింగ్ కళాశాల వరకు రోడ్డు విస్తరించి హైవే రోడ్డుగా అభివృద్ధి చేశారు. అయితే రోడ్డుపై నిలిచే మురుగునీరు, వర్షపునీరు వెళ్ళేందుకు వీలుగా డ్రైనేజి వ్యవస్థను ఆధునీకరించలేదు. రోడ్లపై నిలిచిన మురుగు, వర్షపునీరు డ్రెయిన్‌లలోకి వెళ్ళటంలేదు. బాపట్ల విద్యుత్ డివిజన్ కార్యాలయం ఎదుట ఆధునీకరించిన జీబీసీ రోడ్డుపై నిలిచిన మురుగు డ్రైనేజిలోకి వెళ్ళటం లేదు. పైగా పై నుంచి వచ్చే మురుగు డ్రెయిన్ నుంచి రోడ్డుపైకి వస్తున్నది. ఎంతో కాలంగా ఇక్కడ ఈ సమస్య ఉన్నప్పటికి అధికారులు చర్యలు తీసుకోలేదు. దీనివల్ల మురుగు దుర్గంధ పూరితంగా మారి దోమల వ్యాప్తి అధికమై చుట్టుపక్కల కుటుంబాలవారు నానా ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా మైనర్ డ్రెయిన్‌లు పూడ్చేసిన ప్రాంతాలను సందర్శించిన అధికారులు వాటిలోని మట్టిని తొలిగించి మురుగు ముందుకు ప్రవహించే విధంగా చర్యలు తీసుకోవటంలేదు. సచివాలయ ఉద్యోగులు వచ్చి చూసి వెళ్ళిపోతున్నారే తప్ప సమస్యలు పరిష్కరించటం లేదని పట్టణ ప్రజలు అంటున్నారు. సమస్యపై మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి క్షేత్రస్థాయిలో పర్యటించి పూర్తి స్థాయిలో సమస్యలకు పరిష్కారం చూపాలని ప్రజానీకం కోరుతున్నారు.



బాపట్లలోని 3వ వార్డు రాజీవ్‌గాంధీకాలనీలో సంచరిస్తున్న పందులు

కక్షసాధింపులకు పాల్పడే ఐపీఎస్‌లను శిక్షించాలి : కొల్లా

బాపట్ల, ఆగస్టు 18 : రాజకీయ కక్షసాధింపులకు పాల్పడే ఐపీఎస్‌లను శిక్షించాలని సంగం డెయిరీ మాజీ ఛైర్మన్ కొల్లా వీరయ్యచౌదరి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వైసీపీ పాలనలో మాజీ మంత్రులు అయ్యన్నపాత్రుడు, అచ్చెన్నాయుడు, కళా వెంకట్రావులతో పాటు, చంద్రబాబునాయుడుపై తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపిన ఐపీఎస్‌లపై చర్యలు తీసుకోకపోతే ప్రజాస్వామ్యానికి విలువ ఉంటుందా అని ప్రశ్నించారు. దీనిపై వైసీపీ మాజీ మంత్రి కాకాని గోవర్ధనరెడ్డి ఆరోపణలు చేయటం అవివేకమన్నారు. జగన్ అభివృద్ధి నిరోధక, కక్షసాధింపు పాలన వల్లే ప్రజలు ప్రతిపక్షహోదా కూడా దక్కకుండా కేవలం 11 సీట్లకే పరిమితం చేసి దారుణ పరాజయాన్ని కట్టబెట్టారన్నారు.

శ్రీబగళాముఖి అమ్మవారికి ప్రత్యేక పూజలు

పిట్టలవానిపాలెం ఆగస్టు 18 : మండల పరిధిలోని చందోలు గ్రామంలో ఉన్న శ్రీబగళాముఖి అమ్మవారి దేవస్థానంలో ఆదివారం సందర్భంగా భక్తులు పాల్గొని శ్రావణమాస పూజ కార్యక్రమాలు నిర్వహించుకున్నారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి ఆధ్వర్యంలో భక్తులకు ఆలయ అర్చకులతో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను అందజేశారు.



శ్రీబగళాముఖి అమ్మవారు

వైద్యవిద్యార్థిని మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలి

● ప్రజా సంఘాల నాయకుల డిమాండ్

బాపట్ల, ఆగస్టు 18 : కోల్‌కత్తాలో వైద్య విద్యార్థినిపై అత్యంత దారుణంగా అత్యాచారం చేసి హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ విషయమై ఆదివారం మండలపరిషత్ కార్యాలయ ప్రాంగణంలో కొవ్వొత్తులతో ప్రదర్శన చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా నిందితులను ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారించి వెంటనే శిక్షించాలన్నారు. కార్యక్రమంలో గుడే రాజారావు, కట్టా కోర్నేలియా, తానికొండ ఆనంద్‌బాబు, నలగల ఏలీషా, ఏపూరి జోసఫ్, అమర్‌నాద్, కిషోర్ పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేసిన ఎస్ఐ

పిట్టలవానిపాలెం, ఆగస్టు 18 : మండల పరిధిలోని చందోలు గ్రామానికి చెందిన ఫైజ్ అనే యువకుడు ఇటీవల సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. ఈ విషయమై చందోలు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చందోలు ఎస్ఐ ఆర్.స్వామిశ్రీనివాస్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసి సెల్‌ఫోన్ ఎక్కడపోయిందో కనుగొని ఆదివారం సెల్‌ఫోన్‌దారుడు ఫైజ్‌కు అందజేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఎస్ఐ స్వామి శ్రీనివాస్‌కు సెల్‌ఫోన్‌దారుడు ఫైజ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



ఫైజ్‌కు సెల్‌ఫోన్ అందజేస్తున్న ఎస్ఐ

వేదపారాయణలో ప్రతిభ కనబరిచిన వారికి నగదు ప్రోత్సాహకం

బాపట్ల, ఆగస్టు 18 : మండలంలోని వెదుళ్ళపల్లి శ్రీ శంకర విద్యాలయం వేద పాఠశాల విద్యార్థులకు ఆదివారం నగదు ప్రోత్సాహక బహుమతులు పంపిణీ చేశారు. వేదపాఠశాలలో ప్రతి సంవత్సరం ఉత్తమంగా వేదపారాయణలో ప్రతిభ కనబరిచే విద్యార్థులకు పంపిణీ చేస్తున్నారు. చివుకుల హర్షవర్ధన్ శర్మ, మనుగూర రాఘవేంద్రశర్మలకు రూ.10 వేలు ఎన్ఆర్ఐ తగిరస తులసీ కృష్ణపవన్ అందజేశారు. కార్యక్రమంలో గూడభట్టు, కొలను మోహన్, పూసపాటి శ్రీకాంత్, శంకర విద్యాలయ పాలకవర్గ సభ్యులు, అధ్యాపకులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

కోడూరులో పశు వైద్యశిబిరం

పిట్టలవానిపాలెం, ఆగస్టు 18 : మండల పరిధిలోని సంగుపాలెం కోడూరు గ్రామంలో కర్లపాలెం శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత పశువైద్యశిబిరం నిర్వహించారు. గ్రామస్తులు, పశు వైద్యసిబ్బంది పాల్గొని రైతులకు సంబంధించి పశువులకు వివిధ వైద్యసేవలను నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ఏడీఏ శంకరరావు, మంతెనవారిపాలెం డాక్టర్ తిరుమలతేజ, డి.వెంకటేశ్వరరావు, జూనియర్ వెటర్నరీ అసిస్టెంట్ బి.రవి, చందోలు వైద్యసిబ్బంది తదితరులు పాల్గొని వైద్యం అందించారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా గ్రామీణ సేవా కన్వీనర్ టి.శ్రీనివాసరావు, జిల్లా సేవాదల్ కోఆర్డినేటర్ గోవర్ధన్, శ్రీసత్యసాయి బాపట్ల సమితి సభ్యులు పి.సుబ్బారావు, కె.లక్ష్మణరావు, పి.కామేశ్వరరావు, కర్లపాలెం ఆధ్యాత్మిక కన్వీనర్ అచ్యుతవెంకటేశ్వరరావు, ఎంవీ శివరామరాజు, కడియాల ప్రసాద్ పాల్గొన్నారు.

పెదఅంకమ్మతల్లి ఆలయం వద్ద విశేష పూజలు

కర్లపాలెం, ఆగస్టు 18 : మండలంలోని పాతనందాయపాలెంలో ఈనెల 22న కుంచాల వారి ఈలవేల్పు శ్రీ పెదఅంకమ్మతల్లి ఆలయ ప్రారంభోత్సవం సందర్భంగా ఆదివారం యాగశాలలో పురోహితులు విశేష పూజలు నిర్వహించారు. అంకమ్మతల్లి, విఘ్నేశ్వరుడు, పోతురాజు, నాగదేవతల ప్రతిష్ఠ సందర్భంగా ఆదివారం గణపతిపూజ, శ్రీమాతృశ్రీ పూజారంభం, యాగశాల సంస్కార ప్రయోగారంభం, ద్వారపూజ, తోరణపూజ తదితర కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

కర్లపాలెం, ఆగస్టు 18 : కర్లపాలెం సెంటర్‌లో యూనియన్ బ్యాంక్ ఎదురు శనివారం రాత్రి ఆటో, బైక్ ఢీకొన్న సంఘటనలో మండలంలోని బుద్దాం గ్రామానికి చెందిన మిద్దిబోయన బాలకృష్ణకు తీవ్ర గాయాలై బాపట్ల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందాడని బాపట్ల రూరల్ సీఐ హరికృష్ణ తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిర్వహించామని ఆయన చెప్పారు.

రంగా విగ్రహావిష్కరణతో రహదారికి మోక్షం

కొల్లూరు, ఆగస్టు 18 : వంగవీటి రంగా విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంతో ఆర్ అండ్ బీ రహదారికి మోక్షం లభించింది. మండల పరిధిలోని ఆవులవారిపాలెం, పెసర్లంక పరిధిలో కరకట్ట దిగువ నుంచి ఉన్న ఆర్ అండ్ రోడ్డు ఎంతో కాలంగా గోతులమయం కావడంతో ప్రయాణికులకు ప్రమాదభరితంగా మారింది. ఆదివారం సాయంత్రం ఆవులవారిపాలెంలో రంగా విగ్రహావిష్కరణకు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, ఇతర ప్రముఖులు హాజరు కానుండటంతో విగ్రహ కమిటీ నిర్వాహకులు యంత్ర సహాయంతో రహదారికి ఇరువైపులా ఉన్న మట్టిని తవ్వించి గోతులను పూడ్చి వేశారు. దీని వల్ల ద్విచక్ర వాహనదారులకు ఊరట లభించింది.



ఆవులవారిపాలెంలో ఆర్ అండ్ బీ రహదారిపై గోతులను పూడుస్తున్న ఎక్స్‌కవేటర్

సాయిబాబా ఆలయ అభివృద్ధికి రూ.50 వేల విరాళం

భట్టిప్రోలు (కొల్లూరు), ఆగస్టు 18 : షిరిడి సాయిబాబా ఆలయ అభివృద్ధికి దాతలు రూ.50 వేల విరాళం అందించారు. స్థానిక సాయిబాబా ఆలయంలో సీలింగ్ పనుల నిమిత్తం గ్రామానికి చెందిన మద్దుల సోమశేఖర్ తమ తల్లిదండ్రులు భాస్కరన్, ఉదయశ్రీ జ్ఞాపకార్థం రూ.50 వేలు ఆలయ కమిటీ అధ్యక్షుడు తమ్మన రమేష్‌బాబుకు ఆదివారం అందజేశారు. దేవస్థాన కమిటీ తరుపున సోమశేఖర్, రోహిత దంపతులకు ధన్యవాదాలు తెలిపారు.



ఆలయ అభివృద్ధి కోసం రూ.50 వేలు విరాళం అందిస్తున్న సోమశేఖర్

మట్టి ఖర్చులకు ఆర్థికసాయం అందజేత

కర్లపాలెం, ఆగస్టు 18 : మండలంలోని పేరలిపంచాయతీ బక్కావారి పాలేనికి చెందిన జోగి క్రీస్తుమణి మరణించగా పేరలి నరసయ్య, తిమ్మరాజు కృష్ణమూర్తి మెమోరియల్ చారిటబుల్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ ఛైర్మన్ డాక్టర్ పేరలి బాలకృష్ణమూర్తి సహకారంతో రూ.5 వేల నగదును టీడీపీ మండల అధ్యక్షుడు ఏపూరి భూపతిరావు కుటుంబ సభ్యులకు ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాగిత విజయరాజు, దేవరంపాటి రాజా, మద్దిబోయన బుల్లియ్య, జోగి సురేష్, జోగి రాజేష్, దాసరి రత్నరాజు, జోగి పసి, జోగి ఇశ్రాయిల్, షేక్ జానీ బాషా, షేక్ సుభానీ, జోగి బోజెస్, గేరా రవి, మల్లెల పీటర్‌పాల్, గొర్రెముచ్చు బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మట్టి ఖర్చులకు ఆర్థికసాయం అందజేస్తున్న టీడీపీ నాయకుడు భూపతిరావు తదితరులు

పలుచోట్ల అంకమ్మతల్లి కొలుపులు

కొల్లూరు, ఆగస్టు 18 : పలు చోట్ల అంకమ్మ తల్లి కొలుపులు ఆదివారం నిర్వహించారు. మండల కేంద్రం కొల్లూరులోని 1వ వార్డులో ఉన్న అంకమ్మ తల్లి ఆలయంలో రజక సంఘీయులు, ఉప్పు బజారులోని అంకమ్మ తల్లికి ఉప్పువారు, కోనవారు పెసర్లంకలో వెలివెల వారు అంకమ్మ తల్లికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

పార్వతీ అమ్మవారికి ప్రత్యేక పూజలు

భట్టిప్రోలు (కొల్లూరు), ఆగస్టు 18 : గ్రామ దేవత దండి పార్వతీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రం భట్టిప్రోలులోని పద్మశాలీయ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సంఘస్తులు కనకతప్పెట్లతో పురవీధుల్లో ప్రదర్శనగా ఆలయానికి తరలి వెళ్లి అమ్మవారికి కుంకుమ పూజలు, మొక్కుబడులను తీర్చుకున్నారు. అనంతరం తీర్థ ప్రసాద వినియోగం జరిగింది.



ప్రత్యేక అలంకారంలో దండి పార్వతి అమ్మవారు

భావితరాలకు ఆదర్శప్రాయుడు వంగవీటి రంగా

● విగ్రహావిష్కరణలో పాల్గొన్న రాధా



మాట్లాడుతున్న వంగవీటి రాధా, ఎమ్మెల్యే ఆనందబాబు

కొల్లూరు, ఆగస్టు 18 : భావితరాలకు ఆదర్శప్రాయుడుగా తమ తండ్రి వంగవీటి రంగా నిలిచారని తనయుడు రాధాకృష్ణ అన్నారు. మండలంలోని అవులవారిపాలెంలో ఎస్ఆర్ ఫౌండేషన్, హిమాన్వి ఇన్‌ఫ్రా మేనేజింగ్ డైరెక్టర్ అరవ రామకృష్ణ వంగవీటి రంగా విగ్రహాన్ని ఏర్పాటు చేయించారు. ఆ విగ్రహాన్ని ఆయన తనయుడు రాధాకృష్ణ ఆదివారం సాయంత్రం ఆవిష్కరించారు. ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆనందబాబు మాట్లాడుతూ వంగవీటి రంగా పేద ప్రజల పక్షాన నిలిచి వారి కష్టాలను తీర్చారని, రాజకీయాలకు అతీతంగా ఆయన పని చేసి ఎందరో హృదయాల్లో చెరగని స్థానం సంపాదించుకున్నారన్నారు. టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, రంగా అభిమానులు కొల్లూరులోని అయ్యప్పస్వామి ఆలయం వద్ద నుంచి రాధాతో పాటు ఆనందబాబును భారీ ద్విచక్ర వాహన ర్యాలీతో గ్రామానికి తోడ్కొని వచ్చారు. కార్యక్రమంలో ప్రియదర్శిని విద్యా సంస్థల ఛైర్మన్ చందు రామారావు, మోపిదేవి శ్రీను, మాజీ ఎంపీపీ డాక్టర్ కనగాల మధుసూదనప్రసాద్, తూము నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల పర్యవేక్షణా లోపం... రైతులకు శాపం

● ఎల్‌జీ చానల్ పరిధిలో సాగునీటికి ఇబ్బందులు

అమృతలూరు, ఆగస్టు 18 : నీటిపారుదలశాఖ అధికారుల పర్యవేక్షణా లోపం రైతులకు శాపంగా మారింది. మండల పరిధిలోని ఎల్‌జి చానల్ పరిధిలో సాగు నీటి కోసం రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ కాల్వ పరిధిలో కూచిపూడి, పెదపూడి, అమృతలూరు గ్రామాల పరిధిలో సాగు భూమి ఉంది. అయితే ఈ చానల్‌పై అధికారుల నిర్లక్ష్యం కారణంగా అమృతలూరు గ్రామ పరిధిలోని రైతులకు సాగు నీరందటం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ కాల్వ పరిధిలో వారబంది అమలులో ఉంటుంది. వారబంది అమలు చేయాల్సిన సిబ్బంది ఆదిశగా చర్యలు తీసుకోవడంలో పూర్తి విఫలమయ్యారని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ చానల్‌ను పర్యవేక్షించాల్సిన సిబ్బంది పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని దీనివల్ల పెదపూడి-అమృతలూరు గ్రామాల రైతుల మధ్య మనస్పర్ధలు వస్తున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. కూచిపూడి సెక్షన్ పరిధిలో ఎన్ఎంఆర్‌ల హవా సాగుతుందని, అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారని ఈ కారణంతోనే సమస్య జఠిలంగా మారుతుందని రైతులు ఆగ్రహం వ్యక్తపరుస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు సాగునీరు అందేలా చూడాలని రైతులు కోరుచున్నారు.



పిచ్చి మొక్కలతో ఎల్‌జి చానల్

26 ఏళ్ళ తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

● గురువులకు సన్మానం


రేపల్లె, ఆగస్టు 18 : చిన్ననాటి స్మృతులను గుర్తుచేసుకుంటూ 26 సంవత్సరాల నాటి విద్యార్థినీ, విద్యార్థులు కలుసుకుని ఆనందంగా గడిపారు. మండలంలోని చాట్రగడ్డ సనాతన వేదాంత నిష్టాశ్రమ ఉన్నత పాఠశాలలో 1998-99 సంవత్సరం పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. పూర్వ విద్యార్థులు ప్రస్తుతం తాము ఏమి చేస్తున్నామో ఒకరినొకరు వివరాలు తెలుసుకుని ఆత్మీయ పలుకరింపులు చేసుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పి తమ ఉన్నతికి కారకులైన గురువులను పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించి మెమెంటోలను అందించారు. పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ తమ వద్ద పాఠాలు నేర్చుకుని ప్రతి ఒక్కరూ ఉన్నత శిఖరాలను అధిరోహించటం ఆనందంగా ఉందన్నారు. తోటి వారికి సహాయపడాలనే సద్గుణాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు కృష్ణారావు, చక్రధర్‌రావు, శాంతిలత, భవాని, భాస్కరరావులను పూర్వ విద్యార్థులు పూలమాలలు, దుశ్శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కొక్కిలిగడ్డ ప్రియాంక, సజ్జా యశోదకృష్ణ, పడమట వెంకటసుబ్బారావు, కె.శివసుబ్రహ్మణ్యం, కర్రి తిరుమలరావు, దొరస్వామి, మాధవి, కె.కుసుమ, లక్ష్మీప్రసన్న, స్వప్న తదితరులు పాల్గొన్నారు.



సనాతన వేదాంత నిష్టాశ్రమ ఉన్నత పాఠశాలలోని పూర్వ విద్యార్థులు

అగ్నిబాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

కొల్లూరు, ఆగస్టు 18 : అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన కుటుంబానికి టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ తనవంతు ఆర్థిక సాయం అందించారు. మండల పరిధిలోని కిష్కిందపాలెం గ్రామంలో గత గురువారం తెల్లవారుజామున విద్యుదాఘాతానికి కొక్కిలిగడ్డ ప్రభాకరరావు పూరిల్లు దగ్ధమైంది. బాధిత కుటుంబం కట్టుబట్టలతో నిరాశ్రయులయ్యారు. స్థానిక నాయకుల సమాచారంతో మురళీకృష్ణ ఆదివారం గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించి తనవంతు ఆర్థిక సాయం అందించారు. పార్టీపరంగా అన్నివిధాలా అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుంకర శ్రీను, బోయపాటి తేజ, నర్రా మధు, కృష్ణప్రసాద్, మున్నంగి విజయ్, రావుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.



అగ్నిబాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న మైనేని

ఇరువర్గాలపై కేసులు నమోదు

చెరుకుపల్లి, ఆగస్టు 18 : పాతకక్షల నేపథ్యంలో ఇరువర్గాల మధ్య శనివారం జరిగిన ఘర్షణలో కేసు నమోదు చేసిన సంఘటన మండలంలోని గుళ్ళపల్లిలో జరిగింది. ఎస్ఐ టి.అనిల్‌కుమార్ కథనం ప్రకారం వైసీపీ, టీడీపీకి చెందిన ఇరువర్గాలు ఒకరిపై ఒకరు దాడికి పాల్పడ్డారన్నారు. వైసీపీ కార్యకర్తలు తమ ఇంటిపై 10 మంది దాడి చేశారని టీడీపీకి చెందిన కలగంటి కళాదేవి ఫిర్యాదు అందించారన్నారు. వైసీపీకి చెందిన గాలి శ్రీనివాసరావు, సంపత్‌లు అందించిన ఫిర్యాదు మేరకు ఇరువర్గాలపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఇరువర్గాలకు ఎలాంటి గాయాలు కాలేదని ఎస్ఐ తెలిపారు.

21 మంది ఎస్సైల బదిలీ

వీఆర్‌కు పది మంది

ఒంగోలు (క్రైం), ఆగస్టు 18: జిల్లాలో భారీగా ఎస్సైలను బదిలీ చేశారు. 21 మందికి స్థానచలనం కల్పించారు. ఈమేరకు ఎస్పీ దామోదర్ ఉత్తర్వులు ఇచ్చారు. 10 మందిని వీఆర్‌కు పిలిచారు.

బదిలీ అయిన ఎస్సైల వివరాలు

ఎస్సై పేరు	పనిచేస్తున్న స్థానం	బదిలీ అయిన స్థానం
కె.విజయకుమార్	తాళ్లూరు	దొనకొండ
సాంబశివరాజు	మర్రిపూడి	త్రిపురాంతకం
ఎం.సైదాబాబు	పామూరు	మార్కాపురం టౌన్
పి.అంకమ్మరావు	దోర్నాల	మార్కాపురం రూరల్
టి.రమేష్ బాబు	పీసీపల్లి	మర్రిపూడి
ఎం.మురళి	అటాచ్‌డ్ దర్శి	దర్శి
వై.నాగరాజు	పీటీసీ ఒంగోలు	ముండ్లమూరు
నాగమల్లేశ్వరరావు	దిశ పోలీస్‌స్టేషన్	టంగుటూరు
వి.సుధాకర్	తర్లుపాడు	కొత్తపట్నం
వి.వేమన	వీఆర్	పొదిలి
బి.మహేంద్ర	అటాచ్‌డ్ పుల్లలచెరువు	సింగరాయకొండ
యు.పున్నారావు	టంగుటూరు	జరుగుమల్లి
ఎస్.మల్లికార్జునరావు	వీఆర్	తాళ్లూరు
బి.శివరామయ్య	వీఆర్	మద్దిపాడు
బి.నరసింహారావు	బేస్తవారపేట	కంభం
పి.అనిల్‌కుమార్	వీఆర్	పెద్దారవీడు
పి.చౌడయ్య	నెల్లూరు జిల్లా	ఎర్రగొండపాలెం
జి.గిరిబాబు	గుంటూరు జిల్లా	పొన్నలూరు
ఎస్.సుమన్	పల్నాడు జిల్లా	కొండపి
ఎస్.వి.రవీంద్ర రెడ్డి	బాపట్ల జిల్లా	బేస్తవారపేట
పి.కోటేశ్వరరావు	బాపట్ల జిల్లా	రాచర్ల

వీఆర్‌కు పిలిచిన ఎస్సైలు వీరే..

జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్‌లలో పనిచేస్తున్న 10 మంది ఎస్సైలను వీఆర్‌కు పిలిచారు. వారి స్థానాల్లో ఇతరప్రాంతాల్లో పనిచేస్తున్న వారికి పోస్టింగ్‌లు ఇచ్చారు. వీఆర్‌కు పిలిచిన వారిలో సింగరాయకొండలో పనిచేస్తున్న టి.శ్రీరాం, మద్దిపాడు ఎస్సై వి.మహేష్, ముండ్లమూరులో పనిచేస్తున్న వి.అంజనేయులు, త్రిపురాంతకం నుంచి వి.సాంబశివయ్య, పెద్దారవీడు నుంచి జి.వెంకటసైదులు, కొత్తపట్నం ఎస్సై బి.సాంబశివరావు, మార్కాపురం టౌన్ ఎస్సై అబ్దుల్ రెహమాన్, కొండపిలో పనిచేస్తున్న ఎం.కృష్ణబాజీబాబు, దొనకొండ ఎస్సై ఎల్.సంపత్‌కుమార్, కంభం ఎస్సై పి.రాజేష్ ఉన్నారు. వీరంతా జిల్లా పోలీసు కార్యాలయంలో రిపోర్టు చేయాలని తన ఉత్తర్వుల్లో ఎస్పీ పేర్కొన్నారు.

పాఠశాల విద్యార్థుల
పరీక్షల షెడ్యూల్ విడుదల

- ఎఫ్ఏ-1 పేరు మార్పు
- ఈనెల 27 నుంచి ప్రారంభం

ఒంగోలు (విద్య), ఆగస్టు 18 : ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల్లో 1నుంచి పదో తరగతి వరకూ చదువుతున్న విద్యార్థుల పరీక్షల షెడ్యూల్‌ను విద్యాశిక్షణ మండలి పరిశోధనా సంస్థ (ఎస్సీఈఆర్టీ) డైరెక్టర్ బి.ప్రతాప్‌రెడ్డి విడుదల చేశారు. ఫార్మెటివ్ అసెస్‌మెంట్ (ఎఫ్ఏ-1) పేరు సెల్ఫ్ అసెస్‌మెంట్ మోడల్ పేపర్-1గా మార్చారు. పరీక్షలు ఈనెల 27నుంచి ప్రారంభమవుతాయి. వచ్చేనెల 4 వరకూ నిర్వహిస్తారు. గతేడాది వరకూ ఈ పరీక్షలను రోజుకు రెండు చొప్పున ఉదయం, మధ్యాహ్నం నిర్వహించేవారు. అయితే ప్రస్తుతం రోజుకు ఒకటి చొప్పున ఏడు రోజులు ఉంటాయి.

ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఈనెల 27నుంచి సెప్టెంబరు 2 వరకూ ఉదయం 10.45 నుంచి 11.45 వరకు పరీక్షలు నిర్వహిస్తారు.

ఈనెల 27న 3,4,5తరగతులకు ఓఎస్ఎస్‌సీ పరీక్ష ఉంటుంది.

28న 1నుంచి 5 తరగతులకు తెలుగు, 30న ఇంగ్లీషు, 31న గణితం, సెప్టెంబరు 2న పరిసరాల విజ్ఞానం పరీక్ష నిర్వహిస్తారు.

ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 6,7,8 తరగతులకు 27వతేదీ మధ్యాహ్నం 1.10నుంచి మధ్యాహ్నం 2.10వరకు ఓఎస్ఎస్‌సీ పరీక్ష జరుగుతుంది. 28న తెలుగు, 30న హిందీ, 31న ఇంగ్లీషు, సెప్టెంబరు 2న గణితం, 3న జనరల్ సైన్స్, 4న సోషల్ పరీక్షలు ఉంటాయి. ఇవన్నీ మధ్యాహ్నం 1.30నుంచి 2.30 వరకూ జరుగుతాయి.

హైస్కూళ్లలో 9,10 తరగతులు చదువుతున్న విద్యార్థులకు 27వతేదీ ఉదయం 10నుంచి 11.15 గంటల వరకు ఓఎస్ఎస్‌సీ పేపర్-1, 11.15నుంచి 12.15 గంటల వరకు జీఎస్ఎస్‌సీ పేపర్-2, 28న తెలుగు, 30న హిందీ, 31న ఇంగ్లీషు, సెప్టెంబరు 2న గణితం, 3న జనరల్ సైన్స్, 4న సోషల్ పరీక్షలు జరుగుతాయని ఆ షెడ్యూల్‌లో పేర్కొన్నారు. ప్రశ్నపత్రాలను ప్రభుత్వమే జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు(డీసీఈబీ) ద్వారా పాఠశాలలకు పంపుతుంది.

వైభవంగా తేరాతేజీ

- అధిక సంఖ్యలో తరలివచ్చిన ముస్లింలు
- కంభం చెరువు వద్ద సందడి



తేరాతేజీకి హజరైన ముస్లింలతో కళకళలాడుతున్న కంభం చెరువు కట్ట

కంభం, ఆగస్టు 18 : జిల్లాలోని చారిత్రాత్మక కంభం చెరువుపై ముస్లింలు తేరాతేజీ (గరిక తొక్కుడు) ఉత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ముస్లింలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కంభం చెరువులో నీరు ఉంటే ఈ పండుగ చేసుకుంటారు. ప్రస్తుతం కంభం చెరువులో మూడు అడుగుల మేర నీరు ఉంది. తేరాతేజీ మాసంలో కొత్తగా పెళ్లైన దంపతులు 13 రోజులపాటు దూరంగా ఉంటారు. పుట్టింటికి చేరే వరకు నూతన వధువుకు వరుడి ముఖం కూడా చూపరు. 13వ రోజు ఆహ్లాదాన్ని కలిగించే కంభం చెరువుకు రావడం ఆనవాయితీగా వస్తోంది. బంధువులంతా కలిసి అక్కడే వంటలు వండుకొని భోజనాలు చేసి ఆనందంగా గడుపుతారు. దీన్వావలి దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. పెళ్లినాటి దండలు, పూలు, ఇతరాలను కంభం చెరువులో వదిలివేస్తారు. ఆదివారం జరిగిన ఉత్సవానికి విజయవాడ, హైదరాబాద్, గుంటూరు, కడప, కర్నూలు, అనంతపురం జిల్లాల నుంచి పెద్దత్తున భక్తులు తరలివచ్చారు. ఏటా వేలాది మంది భక్తులు వస్తారని తెలిసినా అధికారులు అక్కడ ఎటువంటి సౌకర్యాలు కల్పించలేదు. పోలీసు సిబ్బంది తగినంత మంది లేకపోవడంతో ట్రాఫిక్ సమస్య పెరిగింది. దీంతో భక్తులు ఇబ్బంది పడ్డారు.

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

తాళ్లూరు, ఆగస్టు 18: సోమవరప్పాడుపరిధిలోని గుంటిగంగ సన్నిధిలో ఆదివారం గంగాభవానీ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. గంగమ్మ తల్లికి పొంగళ్లు పెట్టి కరుణించమని వేడుకున్నారు. తాళ్లూరు పరి సర మండల గ్రామాలకు చెందిన భక్తులతోపాటు వివిధప్రాంతాల నుంచి మొక్కులు తీర్చుకునేందుకు రావటంతో ఆప్రాంతం సందడిగా మారింది.

చల్లంగ చూడమ్మ గంగమ్మ తల్లి అంటూ వేడుకున్నారు. ఆలయబ్రాహ్మణ అర్చ కులు ఎస్.కా మేశ్వరశర్మ, పూజారులు ప్రకాశ్ పంతులు, బాలరాజు అమ్మవారికి పూజలు ని ర్వహించారు. కార్యక్రమంలో ఈవో పి.కార్తిక్, ఆలయ కమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలు ఎయిర్‌ పోర్టు మళ్లీ తెరపైకి

- కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు ప్రకటనతో విస్తృత చర్చ
- పదిరోజుల క్రితం పార్లమెంట్‌లో మాట్లాడిన ఎంపీ మాగుంట
- మూడు రోజులకే ప్రతిపాదన
- 20 ఏళ్ల క్రితమే భూముల గుర్తింపు
- అనంతరం మరుగునపడిన వైనం
- సీఎం చంద్రబాబు జోక్యంతో కదలిక

ఒంగోలులో విమానాశ్రయం ఏర్పాటు అంశం మరోసారి తెరపైకి వచ్చింది. రాష్ట్రంలో ఎయిర్ పోర్టుల అభివృద్ధిపై కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు తాజాగా చేసిన ప్రకటనతో దానిపై మళ్లీ చర్చ మొదలైంది. రెండు దశాబ్దాల క్రితమే ఒంగోలులో ఎయిర్‌పోర్టు ఏర్పాటు ప్రతిపాదన తెరపైకి వచ్చింది. అప్పట్లో కొత్తపట్నం మండలం అల్లూరు, ఆలూరు వద్ద భూములను కూడా గుర్తించారు. అనంతరం అది మరుగునపడింది. ఇప్పుడు టీడీపీ కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టి సారించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీ పర్యటన సందర్భంగా వివిధ అంశాలపై కేంద్రంతో చర్చించారు. అనంతరం కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న ఏడు విమానాశ్రయాలను 14కు పెంచనున్నట్లు ప్రకటించారు. అందులో ఒంగోలు కూడా ఉంది.



ఒంగోలు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులో ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు 20 ఏళ్ల క్రితమే బీజం పడింది. అయితే అది ప్రతిపాదనలకే పరిమితమై అనంతరం మరుగునపడింది. ఇప్పుడు టీడీపీ కూటమి ప్రభుత్వ చొరవతో మళ్లీ తెరపైకి వచ్చింది. ఉమ్మడి రాష్ట్రంలో 2004-07 మధ్య ఉన్న నాటి కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో విమానాశ్రయాల విస్తరణపై ప్రకటన చేసింది. ఆ సమయంలో ఒంగోలుకు ఎయిర్‌పోర్టు ప్రకటించింది. ఆవెంటనే ఒంగోలు సమీపంలోని కొత్తపట్నం మండలం అల్లూరు, ఆలూరు ప్రాంతాల్లో భూములను పరిశీలించారు. సుమారు 650 ఎకరాలు అవసరమని తేల్చారు. ఆమేరకు భూములను కూడా గుర్తించారు. ఒంగోలు చిన్న పట్టణమే అయినప్పటికీ ప్రపంచప్రఖ్యాతి గాంచిన గెలాక్సీ గ్రానైట్, విస్తారంగా తీరప్రాంతం ఉండి భారీగా ఆక్వా సాగు, దేశంలోనే అత్యధికంగా పొగాకు పంట వంటి వ్యాపార సంబంధ అంశాలతోపాటు అప్పట్లో వాన్‌పిక్ ప్రతిపాదన తదితర సానుకూల అంశాలను చూపి ఎయిర్‌పోర్టు ప్రతిపాదన చేశారు. కేంద్ర విమానయానశాఖకు చెందిన అధికారులు పరిశీలన కూడా అప్పట్లోనే పూర్తయ్యింది. భూ సంబంధ వివాదాలు కొంత, ఇతరత్రా కారణాలతో ఆ అంశం ప్రతిపాదనలకే పరిమితమైంది.

గతంలో మరుగునపడిన ప్రతిపాదనలు

ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వంలోని పెద్దలు 2009-14 మధ్య నాటి నెల్లూరు జిల్లాలో దగదర్తి వద్ద ఎయిర్ పోర్టు, దుగరాజపట్నం వద్ద పోర్టు.. అలాగే ప్రకాశం జిల్లాలో రాయమపట్నం వద్ద పోర్టు, ఒంగోలు వద్ద ఎయిర్ పోర్టు ప్రతిపాదనలు పరిశీలన చేసి ఒకే జిల్లాలో అటు పోర్టు, ఇటు ఎయిర్‌పోర్టు రెండూ నిర్మాణం సాధ్యం కాదన్న అభిప్రాయానికి వచ్చినట్లు తెలిసింది. నెల్లూరు జిల్లాలో ఎయిర్ పోర్టు, ప్రకాశం జిల్లాలో పోర్టు నిర్మిచాలని అనధికారికంగా ఒక అవగాహనకు వచ్చినట్లు అప్పట్లో విస్తృత ప్రచారం జరిగింది. ఆ నేపథ్యంలో ఒంగోలు ఎయిర్‌పోర్టు మరుగునపడి నెల్లూరు జిల్లా దగదర్తి ఎయిర్ పోర్టు ముందుకు కదిలింది. దీంతో ఒంగోలు ఎయిర్‌పోర్టు లేనట్లేనన్న భావన వచ్చింది. ఆతర్వాత దొనకొండలోని పురాతన విమానశ్రయ పునరుద్ధరణ చర్యలు, కదలికతో ఇక ఒంగోలు విమానాశ్రయం లేనట్లేనన్న అభిప్రాయం అందరిలోనూ వ్యక్తమైంది.

ఒంగోలులో ఎయిర్‌పోర్టుపై అధ్యయనం

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుక్రవారం ఢిల్లీ పర్యటన సందర్భంగా రాష్ట్రానికి చెందిన పలు కీలక రంగాలపై కేంద్ర మంత్రులతో భేటీ అయ్యారు. అందులో ప్రస్తుతం ఉన్న విమానాశ్రయాల అభివృద్ధి, కొత్తవి ఏర్పాటు వ్యవహారంపై సంబంధిత మంత్రి రామ్మోహన్‌నాయుడుతో కూడా సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న ఏడు విమానాశ్రయాలను 14కు పెంచనున్నట్లు ప్రకటించారు. అందులో ఒంగోలు కూడా ఉంది. ఒంగోలులో ఎయిర్‌పోర్టు ఏర్పాటుపై అధ్యయనం చేయనున్నట్లు ప్రకటించారు. దీంతో మరోసారి ఈ అంశం తెరపైకి వచ్చింది. వివిధ వర్గాల ప్రజల్లో దీనిపై విస్తృత చర్చ సాగుతోంది. గతంలోనే భూములు గుర్తింపు కూడా జరిగిన నేపథ్యంలో పాలకపక్ష నేతలు దీనిపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

టీడీపీ కూటమి ప్రభుత్వంలో మళ్లీ కదలిక

రాష్ట్రంలో తాజాగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం మౌలిక రంగాల అభివృద్ధి, అందులోనూ కేంద్రం సహకారంతో చేపట్టే రోడ్లు, రైలు, ఎయిర్‌వేస్, జల రవాణాపై ప్రత్యేక దృష్టి సారించింది. పాత ప్రతిపాదనల ఫైళ్లు దుమ్ముదులిపి తిరిగి కేంద్రం వద్ద చర్చకు పెడుతోంది. ఈ క్రమంలో ఒంగోలు ఎయిర్ పోర్టు అంశం తిరిగి తెరపైకి వచ్చింది. పది రోజుల క్రితం పార్లమెంట్‌లో విమానాశ్రయాల విస్తరణపై జరిగిన చర్చలో ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి ఒంగోలు ఎయిర్ పోర్టు అంశాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. గతంలో ఉన్న ప్రతిపాదనలు, మినీ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అనువుగా భూముల గుర్తింపు తదితరాలను వివరించి 60శాతం కేంద్రం, 40శాతం రాష్ట్ర నిధులతో నిర్మించాలని కోరారు.

సర్దుబాటుకు సర్వం సిద్ధం

ఎంఈవోల లాగిన్‌కు సవరణ జాబితాలు

టీచర్లకు నేడు మండలాల్లో కౌన్సెలింగ్

ఒంగోలు (విద్య),ఆగస్టు 18 : జిల్లాలో ఉపాధ్యాయుల పని సర్దుబాటుకు సర్వం సిద్ధమైంది. మండల విద్యాధికారుల లాగిన్‌కు సవరించిన మిగులు టీచర్ల సీనియారిటీ జాబితాలు వచ్చాయి. వాటి ఆధారంగా సర్దుబాటుకు అన్ని ఏర్పాట్లు ఆదివారం రాత్రికే పూర్తి చేశారు. సోమవారం మండల స్థాయిలో మిగులు టీచర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని విద్యాశాఖ నిర్ణయించింది. ఈమేరకు మొదట ప్రకటించిన మిగులు టీచర్ల జాబితాపై అభ్యంతరాలు వెల్లువెత్తడంతో సవరణకు అవకాశం కల్పించింది. పాఠశాల విద్య కమిషనర్ విజయరామరాజు ఉపాధ్యాయ సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించి వారి సలహాలు, సూచనలు స్వీకరించారు. కొన్నింటికి ఆయన ఆమోదం తెలిపారు.

794 మంది మిగులు టీచర్లు

జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మునిసిపల్ యాజమాన్యాల్లోని పాఠశాలల్లో ఈనెల 16నాటికి నమోదైన యుడైస్‌లోని విద్యార్థుల సంఖ్య ప్రామాణికంగా 794 మంది టీచర్లు మిగులుగా ఉన్నట్లు గుర్తించారు. వారిలో అత్యధికంగా 500 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లు ఉన్నారు. స్కూలు అసిస్టెంట్ తెలుగు 55 మంది, హిందీ 42 మంది, సోషల్ స్టడీస్ 27 మంది, బయోలాజికల్ సైన్స్ 23 మంది, ఉర్దూ 8 మంది, ఇంగ్లీషు 19మంది, పీఎస్ 32మంది తేలారు. మినిమం టైం స్కేలుతో కాంట్రాక్టు టీచర్లుగా పనిచేస్తున్న 43 మంది, ఎల్‌పీ తెలుగు, హిందీ ఒక్కొక్కరు, ఎస్‌జీటీ ఉర్దూ 16మంది మిగులుగా ఉన్నారు. మొదట ప్రకటించిన మిగులు జాబితాలో 906 మంది టీచర్లు ఉండగా సవరించిన జాబితాలో 112 మంది తగ్గారు. మార్కాపురం మండలంలో గరిష్ఠంగా 71 మంది, అర్ధవీడులో 9 మంది, బేస్తవారపేటలో ఆరుగురు, సీఎస్‌పురంలో 16 మంది, చీమకుర్తిలో 29 మంది, కంభంలో 26, దర్శిలో 45, దొనకొండ 15, గిద్దలూరులో 31, హనుమంతునిపాడులో 16, కనిగిరిలో 38 మంది టీచర్లు మిగులు ఉన్నారు. కొమరోలు మండలంలో 47 మంది, కొనకనమిట్లలో 28, కొండపిలో 11, కొత్తపట్నంలో 21 మంది, కురిచేడులో 20 మంది, మద్దిపాడులో 20, మర్రిపూడిలో 15, ముండ్లమూరులో 22, ఎన్‌జీపాడులో 12, ఒంగోలులో 48, పీసీపల్లిలో 17, పెదదోర్నాలలో 7, పామూరులో 9, పెద్దారవీడులో 23 మంది మిగులుగా తేలారు. పొదిలి మండలంలో 23 మంది, పొన్నలూరులో 22, పుల్లలచెరువులో 12, రాచర్లలో 23, సంతనూతలపాడులో 29, సింగరాయకొండలో 16, త్రిపురాంతకంలో 22, తాళ్లూరులో 17, టంగుటూరులో 12, తర్లుపాడులో 18, వెలిగండ్లలో 7, ఎర్రగొండపాలెంలో 22, జరుగుమల్లి మండలంలో ఎనిమిది మంది మిగులుగా టీచర్లు ఉన్నారు.

సీనియారిటీ జాబితాపై 29 అభ్యంతరాలు

సీనియారిటీ జాబితాపై జిల్లాలోని టీచర్ల నుంచి 29 అభ్యంతరాలు రాగా వీటన్నింటినీ కమిషనర్ కార్యాలయానికి పంపించారు. సవరించిన సీనియారిటీ జాబితా ప్రస్తుతం ఎంఈవో లాగిన్‌కు వచ్చింది. వీటిపైన ఏమైనా అభ్యంతరాలు ఉంటే పాఠశాల విద్య కమిషనర్ కార్యాలయంలోని ఐటీ బృందం దృష్టికి తీసుకెళ్తే పరిష్కరిస్తామని ప్రభుత్వం పేర్కొంది. ప్రస్తుతం ఎంఈవో లాగిన్‌కు వచ్చిన సవరించిన సీనియారిటీ జాబితాలపై ఎటువంటి అభ్యంతరాలు లేకపోతే ఈరాత్రికే అన్ని ఏర్పాట్లు చేసుకొని సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించి టీచర్ల సర్దుబాటు ప్రక్రియను పూర్తి చేయమన్నారు. సర్దుబాటుకు సంబంధించిన సూచనలను విధిగా పాటించాలని, ఏమైనా సమస్యలు ఉంటే వర్క్ అడ్జస్ట్‌మెంట్ గ్రూపులో పోస్టు చేయాలని కోరారు. తాజా సూచనలు ప్రకారం మండల స్థాయికే పనిసర్దుబాటు పరిమితమ్యేలా ఉంది. డివిజన్ స్థాయిలో సర్దుబాటు అనుమానంగా కన్పిస్తోంది.

కొనసాగిన జూడాల నిరసన

రక్షణ చట్టం తీసుకురావాలని డిమాండ్

ఒంగోలు (కార్పొరేషన్), ఆగస్టు 18 : కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారాన్ని నిరసిస్తూ జూనియర్ డాక్టర్లు చేపట్టిన ఆందోళన మూడోరోజూ కొనసాగింది. ఆదివారం జూడాలు విధులు బహిష్కరించారు. ఆసుపత్రి ఆవరణలో 'రియల్ మెన్.. డోంట్ రేప్' పేరుతో రోడ్డుపై చిత్రాలను గీచి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా జూడాలు మాట్లాడుతూ ఈనెల 9న పశ్చిమబెంగాల్‌లోని కోల్‌కతాలో జూనియర్ డాక్టర్ హత్యాచారానికి గురైతే అక్కడి ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైద్య రంగ రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.అజయ్‌కుమార్ రెడ్డి, ఉపాధ్యక్షురాలు బొగ్గు శృతి, ప్రధాన కార్యదర్శులు చైతన్యసాయి, విష్ణుప్రియ, జాయింట్ సెక్రటరీలు అవినాష్ కుమార్, ఎం.సాయి పవిత్ర, ఇతర జూనియర్ డాక్టర్లు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నుంచి 24 గంటలపాటు నిలిపివేసిన ప్రైవేటు వైద్యులు ఓపీ, వైద్య సేవలు ఆదివారం పునరుద్ధరించారు.

ఘనంగా నాగభైరవ సాహిత్య పురస్కార సభ

ఒంగోలు(కల్చరల్), ఆగస్టు 18: నాగభైరవ సాహిత్యపీఠం ప్రతి ఏడాది డాక్టర్ నాగభైరవ కోటేశ్వరరావు పేరిట అందిస్తున్న సాహిత్య పు రస్కార ప్రదాన సభ ఆదివా రం స్థానిక మల్లయ్యలింగం భవన్‌లో ఘనంగా జరిగింది. సాహిత్యపీఠం అధ్యక్షుడు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రజానాట్యమండలి రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లు (అన్న) మాట్లాడుతూ నాగభైరవ కోటేశ్వరరావు ఎంతో మందిని సాహిత్య రంగంలో తీర్చిదిద్దారన్నారు. అటువంటి మహనీయుని పేరిట పురస్కారాలు అందజేయటం అభినందనీయమన్నారు.

నాగభైరవ కోటేశ్వరరావు మంచి మనసున్న కవి అని, తన లాంటి ఎందరినో సాహిత్యరంగంలో ప్రోత్సహించారని తేళ్ల అరుణ పేర్కొన్నారు. ఈసందర్భంగా సాహిత్యపురస్కారాల ప్రథమ బహుమతిని పూలపూల వాన రచయిత ఏనుగు నరసింహారెడ్డికి, ద్వితీయ బహుమతిని మణిపూసలు రచయిత డాక్టర్ వూటుకూరి వరప్ర సాద్‌కు, కళాపురస్కారాలను నాటక సినీ రచయిత వై.కృష్ణేశ్వరరావుకు, ఆత్మీయ పురస్కారాన్ని డాక్టర్ బీరం సుందరరావుకు అందజేశారు.

మానవత్వం చాటుకున్న ఎస్ఐ

ముండ్లమూరు, ఆగస్టు 18: మండలంలోని వేముల గ్రామానికి చెందిన షేక్ మౌలాబీ శనివారం రమణారెడ్డిపాలెంలో వద్ద జరిగిన ఆటో ప్రమాదంలో మృతి చెందారు. పది సంవత్సరాల క్రితం ఆమె భర్త కాలేషా మృతి చెందారు. వీరికి ఫరీద్, కరిష్మా అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. తల్లిదండ్రులను కోల్పోయి అనాథలయ్యారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ వి.నాగమల్లేశ్వరరావు ఆ చిన్నారులను చూసి చలించిపోయారు. మౌలాబీ కుమారుడు ఫరీద్‌కు రూ.10 వేలు సాయం చేశారు.

ఆలయ భూములకు రక్షణ కరువు

- రూ.వంద కోట్లకుపైగా ఆస్తుల ఆక్రమణ
- పట్టించుకోని అధికారులు
- యథేచ్ఛగా భూముల అన్యాక్రాంతం



భజంత్రీల మాన్యంలో వేసిన లేఔట్లు

పామూరు, ఆగస్టు 18: దేవుడి భూము లకు రక్షణ కరువైంది. యథేచ్ఛగా భూములను ఆక్ర మించుకొని రికార్డుల్లో పేర్లు మార్చుకొని సొమ్ము చేసు కొంటున్నారు. పామూరులోని మదనవేణుగోపాల స్వా మి దేవస్థానానికి సంబంధించిన కోట్లాది రూపాయల విలువ కలిగిన భూములు ఈపాటికే ఆక్రమణకు గురయ్యాయి. వాటిల్లో పక్కా భవనాలతోపాటు, వెంచర్లు వేశారు. తూతూమంత్రంగా చర్యలు తీసుకుంటూ రెవెన్యూ ఎండోమెంట్ అధికారులు మమ అనిపిస్తున్నారు.

పామూరులోని శ్రీమదనవేణుగోపాలస్వామి, శ్రీవల్లీ భుజంగేశ్వరస్వామి, వరదరాజులస్వామి, ఆంజనేయ స్వామి దేవస్థానాలకు చెందిన సుమారు 395 ఎకరాల భూములు, ఉన్నాయి. అం దులో ఇప్పటివరకు వివిద రూపాల్లో 75 ఎకరాలకు పైగా ఆక్రమణలకు గురయ్యాయి. ఆక్రమణకు గురైన భూముల విలువ మార్కెట్‌లో రూ.వంద కోట్లకు పైగా ఉంటుంది. కొందరు ఆక్రమణదారులు తప్పుడు పత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్లు చేయించుకు న్నారు. పామూరు రెవెన్యూ గ్రామ పరిధి లోని సర్వే నెంబర్ 176/2లో 13.80 ఎకరాల భూములు ఉన్నాయి. అందులో ఒక టిన్నర ఎకరా భూమిని ఓ ప్రయివేట్ వెంచర్ సంస్థ ఆక్రమించి రహదారి ఏర్పాటుచేసుకున్నారు. ఇక్కడ ఎక రా భూమి విలువ రూ.2 కోట్లకు పైగా ఉంది. సర్వే నెంబర్ 329/2లో 2.41 ఎకరాల భూమిలోను ఎకరా భూమిని ఆక్రమించి ప్లాట్లు వేసి సొమ్ము చేసుకొన్నారు. మరి కొందరు కట్టడాలు నిర్మించుకొన్నారు. సర్వే నెంబర్ 439/5లో 1.97 ఎకరాల భూమిలో ప్లాట్లు వేశారు.

వేణుగోపాలస్వామి ఆలయానికి సంబంధించి నెల్లూరు జిల్లా వరికుంటపాడు మండలం వేంపాడు రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వేనెంబర్ 78/1లో ఉన్న 6.06 ఎకరాల భూమి అర్చకుల దగ్గర కొనుగోలు చేశామంటూ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. జాతీయ ర హదారికి పక్కనే ఉన్న ఈ భూమి విలువ రూ.20 కోట్లు ఉంటుంది. ఈ భూమికి కమిటీతో సంబంధం లే కుండా అర్చకులు తమకు విక్రయించినట్లు అధికారులను లోబరుచుకొని బినామీ రికార్డులు సృష్టించి 2016లో రిజిస్ట్రేషన్ చేయించుకొన్నారు.

దేవస్థాన అధికారులు తమకు ఎన్‌వోసీ ఇచ్చేందుకు సహకరించడంలేదని పట్టాలు పొందినారు గతేడాది జూన్ 2న జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దాంతో అప్రమత్తమైన ఎండోమెంట్ అధికారులు విచారణ చేపట్టి పట్టాలు పొందిన వ్యక్తుల పేర్లు తొలగించి ఆలయ భూమిగా నమోదు చేయాలని అక్టోబర్ 26న తీర్పు ఇచ్చారు. దాంతో స్థానిక అధికారులు ఆ భూమిలో బోర్డులు ఏర్పాటుచేశారు.

వల్లీ భుజంగేశ్వర దేవస్థానానికి సంబంధించి సర్వే నెంబర్ 438/2లో 7.66 ఎకరాల భూములు ఉన్నాయి. వీటిలో ఆక్రమణదారులు జామాయిల్ తోటలు సాగు చేస్తున్నారు. పామూరు కొత్త చెరువు వెనుక భాగం జాతీయ రహదారికి పక్కన సర్వే నెంబర్ 399/6లో 1.55 ఎకరాల విలువైన భూమిపై ఆక్రమణదారులు కన్నేశారు. తప్పుడు పత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్ చేయించుకొని వెబ్‌ల్యాండ్‌లో పేర్లు నమోదు చేసుకున్నారు. ఎఫ్ఎల్ఆర్‌లో మాత్రం భజంత్రీల మాన్యంగా నమోదై ఉంది. దీని విలువ మార్కెట్‌లో రూ.4 కోట్లకు పైగా ఉంది. ప్రస్తుతం ఆక్రమణ దారులు లేఅవుట్ వేసి అమ్మకాలు జరుపుతున్నారు. 256/2, 256/1, 441లో 1,2,3, 442 1,2,3, లోని భూములు ఆక్రమ ణదారుల చెరలో ఉన్నాయి.

ఇప్పటికైనా సంబంధిత శాఖ జిల్లా అధికారులు స్పందించి దేవస్థాన భూములను 22ఏ1సి రిజిస్ట్రేషన్ చట్టం 1908లోని నిషేధిత ఆస్తుల జాబితాలో చేర్పించి రక్షణ చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

ఆటో బోల్తా.. ఒకరు మృతి



బోల్తాపడిన ఆటో

దర్శి, ఆగస్టు 18: ఆటో బోల్తాపడి మహిళ మృతి చెందారు. ఈఘటన ఆదివారం ఉదయం మండలంలోని రామచంద్రాపురంలో చోటుచే సుకుంది. జముకులదిన్నె గ్రామానికి చెందిన 16 మంది కూలీ పనుల కోసం ఆటోలో రామచంద్రాపురం వెళ్తున్నా రు. ఈక్రమంలో రామచంద్రాపురం గ్రామ సమీపంలో మలుపువద్ద బ్రేక్ వేసేందుకు డ్రైవర్ యత్నించారు. అయితే, బ్రేక్ కింద పొరపాటున అన్నం క్యారేజీ పడటంతో బ్రేక్ పడలేదు. దీంతో వేగంగా వెళ్తున్న ఆటో మలుపు వద్ద బోల్తా పడింది. వీరిలో 12 మంది గాయపడ్డారు. క్షతగాత్రులను 108 ద్వారా దర్శి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం ముగ్గురిని మెరుగైన వైద్యం నిమిత్తం ఒంగోలుకు తరలించారు. అక్కడ చికిత్సపొం దుతూ నాగేంద్రం అనే మహిళ మృతిచెందారు. మిగిలినవారు దర్శిలో వైద్యం పొందుతున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు



బాధ్యతలు చేపట్టిన మురళి

దర్శి, ఆగస్టు 18: దర్శి నూతన ఎస్ఐగా ఎం.మురళి ఆదివారం బాధ్యతలు చేపట్టారు. చీరాలలో పనిచేస్తున్న ఆయన దర్శికి బదిలీ అయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడు తూ శాంతి భద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుం టామని స్పష్టం చేశారు. పేకాట, బెట్టింగులు, తదితర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసు కుంటామన్నారు. ఈవ్‌టీజింగ్‌ను ఉక్కుపాదంతో అణిచి వేస్తా మన్నారు. దర్శి పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు అవసర మైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు పూర్తి సహకారం అందించాలని కోరారు.

ముండ్లమూరు ఎస్ఐ బదిలీ

ముండ్లమూరు, ఆగస్టు 18: స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేస్తున్న వి.నాగమల్లేశ్వరరావు టంగుటూరుకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఒంగోలు డీసీఆర్‌బీలో పనిచేస్తున్న వై.నాగరాజు నియమితులయ్యారు.

నేడు శ్రీనివాస కల్యాణ మహోత్సవం

చినగంజాం, ఆగస్టు 18 : భూ సమేత భావనారాయణస్వామి దేవస్థానంలో వేంకటేశ్వరస్వామి తిరునక్షత్రం (జన్మ నక్షత్రం) శ్రవణం సందర్భంగా సోమవారం రాత్రి 7గంటలకు శ్రీనివాస కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు జీ పిచ్చయ్య ఆదివారం ప్రకటనలో తెలిపారు. 8వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీనివాస కల్యాణాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కల్యాణాన్ని తిలకంచి, తీర్థప్రసాదాలు స్వీకరించాలని పిచ్చయ్య కోరారు.

రూ.లక్ష విరాళం



ఈవోకు విరాళాన్ని అందజేస్తున్న దాతలు

అద్దంకి, ఆగస్టు 18 : శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం రాతి ముఖ మండప నిర్మాణానికి నెల్లూరుకు చెందిన దాత వల్లెపు సంజీవరావు, నాగాంజమ్మ దంపతులు ఆదివారం ఈవో సుబద్రకు రూ.1,00,116 అందజేశారు. వల్లెపు వెంకటేశ్వర్లు, దుర్గమ్మ జ్ఞాపకార్థం కుమారుడు సంజీవరావు, నాగాంజమ్మ అందజేసినట్లు ఈవో తెలిపారు.

ఆర్వోబీ నిర్మాణం ఎప్పుడో?

- కార్యరూపం దాల్చని హామీ
- ఓవర్ బ్రిడ్జితో రాకపోకలకు సౌకర్యం

చీరాల, ఆగస్టు 18 : అగ్నిమాపక కేంద్రం సమీపంలోని రైల్వే లెవల్ క్రాసింగ్ వద్ద ఆర్వోబీ (రోడ్డు ఓవర్ బ్రిడ్జి)ని ఏర్పాటు చేస్తామని పాలకులు, అధికారులు చెప్పినమాట కొన్ని సంవత్సరాలుగా కార్యరూపం దాల్చడంలేదు. దీంతో ఆ నిర్మాణం ఎప్పుడు జరుగుతుందా అని ప్రజలు చర్చించుకుంటున్నారు. మున్సిపల్ పరిధిలో మొత్తం 33 వార్డులు ఉన్నాయి. అందులో 9 వార్డులు రైలుగేటుకు అవతల ఉంటాయి. ఆ వార్డుల నుంచి సింహభాగం ప్రజలు ఈ గేటు నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. ఈ క్రమంలో అక్కడ ఆర్వోబీ ఏర్పాటుకు సంబంధించి స్థల పరిశీలన జరిగి కొన్ని సంవత్సరాలు గడిచింది. ప్రభుత్వాలు మారాయి. పాలకులు మారారు. కాని అక్కడి పరిస్థితిలో ఎలాంటి మార్పులేదు. రైలు గేటు వేసినప్పుడు పలువురు దిచక్ర వాహనచోదకులు, రిక్షాపుల్లర్లు, సైకిల్తో వచ్చే వారు గేటు కింద నుంచి ప్రమాదకరంగా రాకపోకలు సాగిస్తుంటారు. కొన్ని సందర్భాల్లో వారికి ఎలా ఉన్నా చూసే వారికి ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన కలిగించేరీతిలో సంఘటనలు ఉంటాయి. ప్రధానంగా ఉదయం, సాయంత్రం వేళల్లో స్కూల్స్, కాలేజీలకు వెళ్లే వారు, ఇతర ఉద్యోగాలకు, దినసరి పనులకు రాకపోకలు సాగించేవారు వెంటవెంటనే గేటు పడుతుండడంతో ఇబ్బంది పడుతున్నామంటున్నారు. ఇదిలావుంటే అక్కడ ఆర్వోబీ ఏర్పాటు చేస్తే తమకు ఇబ్బందవుతుందని పలువురు అప్పట్లో ఆందోళన చేపట్టారు. ఆర్వోబీ కాకుండా అండర్పాస్ నిర్మాణం చేపట్టాలని వారు సూచించారు. ఆ తరువాత ఒకటికి రెండు పర్యాయాలు సంబంధిత అధికారులు ప్రజాప్రతినిధులు ఆ ప్రాంతంలో పర్యటించారు. స్థానికులు అభిప్రాయాలు సేకరించారు. కొలతలు కూడా తీశారు.



లెవల్క్రాసింగ్ వద్ద రైలుగేటు కింది నుంచి వచ్చేందుకు ప్రయత్నిస్తున్న రిక్షా పుల్లర్

ఎక్కడ వేసిన గొంగళి అక్కడే

అగ్నిమాపక కేంద్రం గేటు వద్ద ఆర్వోబీ నిర్మాణం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా కొనసాగుతోంది. 2016లో ప్రతిపాదన వచ్చింది. తొలుత ఆర్వోబీ ప్రతిపాదన వచ్చినపుడు అప్పట్లో మున్సిపల్, రైల్వే, ఆర్ అండ్ బీ, రెవెన్యూ అధికారుల సమిష్టి సర్వే జరిగింది. ఆర్ అండ్ బీ అధికారులు డీపీఆర్(డీటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు) తయారు చేశారు. తొలుత రూ.68కోట్లతో ప్రతిపాదనలు తయారు చేశారు. అదే 2022కు ఆ వ్యయం అంచనా రూ.100 కోట్లు పై చిలుకు ఉంటుందని అంచనా వేశారు. ప్రస్తుతం డీపీఆర్కు సంబంధించి ఓ కన్సెల్టీసీకి బాధ్యతలు అప్పగించారు. అది ఎప్పటికి పూర్తవుతుందో సంబంధీకులు చెప్పలేమంటున్నారు. అంచనా వ్యయం పెరిగిన ఎస్ఎస్ఆర్ రేట్లతో పోలిస్తే సుమారు రూ.130కోట్లు అయ్యే అవకాశం ఉంటుందని చెప్తున్నారు.

అనుకూల ప్రభుత్వాలు ఏర్పడిన నేపథ్యంలో

ప్రస్తుతం అటు కేంద్రంలో, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్న నేపథ్యంలో ఆర్వోబీ నిర్మాణానికి తగిన చర్యలు వేగవంతం చేయాలని ప్రజలు కోరుతున్నారు. అక్కడ ఆర్వోబీ నిర్మాణం జరిగితే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని భావిస్తున్నారు.



కార్యాలయ గదిని ప్రారంభిస్తున్న వెంకట అప్పారావు

ఆరామ క్షేత్రం ప్రారంభం

అద్దంకిటౌన్, ఆగస్టు 18 : అద్దంకి సీమ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని పాత శివాలయం వద్ద నిర్మించిన ఆరామ క్షేత్రంలో ఆదివారం కార్యాలయ గదిని ధర్మవరపు చారిటీస్ తరపున ధర్మవరపు అప్పారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు జమ్మలమడక హనుమంతరావు మాట్లాడుతు ఆరామ క్షేత్రం ఆధునీకరణ, మొదటి అంతస్తు పూర్తికి చేయడానికి సూమారు రూ.19లక్షల విరాళాలను సేకరించి పూర్తి చేసినట్లు చెప్పారు. మొదటి అంతస్తు కార్యాలయ గదిని ధర్మవరపు చారిటీస్ తరపున రూ.3లక్షలతో నిర్మించినట్లు చెప్పారు. బ్రాహ్మణ కుటుంబాలు కర్మ కార్యక్రమాలకు వినియోగించుకోవాలని కోరారు. కార్రక్రమంలో సంఘ కార్యదర్శి ఈదర శివప్రసాద్, కోశాదికారి నాగరాజు, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, ధర్మవరపు శ్రావణ్కుమార్, లక్కరాజు చంద్రశేఖర్, వెంకటేశ్వరరావు, వెంకటరత్నం, శ్రీనివాస్, సప్తాచలశర్మ, శ్రీనివాసరావు, మోహనరావు, సుబ్రహ్మణ్యం, రాధాకృష్ణమూర్తి, భవన్నారాయణ, సీతారామయ్య, సత్యం పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన కల్పించాలి



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

అద్దంకిటౌన్, ఆగస్టు 18 : హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందని అద్దంకి, కొరిశ పాడు టీఐ అవుట్రిచ్ వర్కర్స్ కరుణ, కృష్ణవేణి అన్నారు. ఆదివారం పట్టణంలోని సంజీవనగర్లో మీకు తెలుసా అనే కార్యక్రమంలో భాగంగా హెచ్ఐవీ, ఎయిడ్స్పై మహిళలు, యువతకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సభ్యులు శ్రావణి, మల్లేశ్వరి, శారద, నయోమి, కృపాదానం పాల్గొన్నారు.

వ్యక్తిపై సీసాతో దాడి



వివరాలు సేకరిస్తున్న ఎస్ఐ

చీరాలటౌన్, ఆగస్టు 18 : వ్యక్తిపై మరో వ్యక్తి సీసాతో దాడి చేయగా బాధితుడు చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. ఈఘటన ఆదివారం మధ్యాహ్నం కారంచేడు మండలం కుంకులమర్రు గ్రామంలో చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన జమ్మలమడుగు ఏసురత్నం, బిళ్ల ప్రశాంత్ ఒకే ముఠాలోని రోజువారీ కూలీలు. వీరిద్దరూ మధ్యాహ్న సమయంలో ఓ గోడౌన్లో పని చేసి విశ్రాంతి తీసుకునే సమయంలో పరస్పరం గొడవ పడ్డారు. దీంతో ప్రశాంత్ సీసా పగలకొట్టి గొంతుపై పలు చోట్ల దాడిచేసి గాయపరిచాడు. దీంతో అపస్మారక స్థితిలో ఉన్న బాధితుడిని స్థానికులు 108 సహాయంతో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. వైద్యులు అతడికి శస్త్ర చికిత్స చేశారు. ప్రస్తుతం అతడి పరిస్థితి నిలకడగా ఉంది. ఈ మేరకు అవుట్పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు. దీంతో సమాచారం అందుకున్న కారంచేడు ఎస్ఐ వెంకటరావు హాస్పిటల్కు చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ప్రశాంత్ కూడా స్వల్ప గాయంతో హాస్పిటల్లో చేరాడు.

బావిలో పడి రైతు మృతి



వెంకటరెడ్డి మృతదేహం

ఏల్చూరు (సంతమాగులూరు), ఆగస్టు 18 : మండలంలోని ఏల్చూరు గ్రామానికి చెందిన చల్లా వెంకటరెడ్డి (37) అనే రైతు ఆదివారం పొలం వద్ద ఉన్న బావిలో కాలుజారి పడి మృతి చెందారు. సంతమాగులూరు ఏఎస్ఐ రావినూతల నాగేష్ బాబు తెలిపిన వివరాల ప్రకారం ఏల్చూరు గ్రామానికి చెం దిన వెంకటరెడ్డి ఆదివారం ఉదయం పొలం పనులకు వెళ్లారు. అక్కడున్న నేలబావిలో నీటి కోసం దిగి కాలుజారి పడిపోయినట్లు తెలిపారు. ఈతగాళ్లతో మృతదేహాన్ని బయటకు తీసినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. వెంకటరెడ్డికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

ఎనిమిది మంది జూదరుల అరెస్టు

స్వర్ణ(పర్చూరు), ఆగస్టు 18 : కారంచేడు మండలం స్వర్ణ గ్రామంలో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ వెంకట్రావు తెలిపారు. అందిన సమాచారం మేరకు.. పేకాట శిబిరంపై దాడి చేసి జూదరులను అరెస్టు చేశామని, వారి నుంచి రూ.3490 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుస్తామని ఎస్ఐ తెలిపారు.

ఎనిమిది దుకాణాలపై కేసులు

అద్దంకి, ఆగస్టు 18 : అద్దంకి పట్టణంలోని పలు దుకాణాలను జిల్లా తూనికల కొలతల అధికారి నాగేశ్వరరావు ఆదివారం తనిఖీలు చేసి 8 దుకాణాలపై కేసులు నమోదు చేశారు. ఒక బియ్యం దుకాణం, రెండు చికెన్ దుకాణాలలో తూకాలలో వ్యత్యాసం ఉండగా, మిగిలిన 5 చికెన్ దుకాణాలలో కాటాలకు ముద్రలు లేనట్లు గుర్తించి కేసులు నమోదు చేశారు.

పురుగు మందుల షాపులో చోరీ

- రూ.96వేల అపహరణ
- ఎగ్జాస్ట్ ఫ్యాన్ రంధ్రం ద్వారా దూరిన దొంగలు

పర్చూరు, ఆగస్టు 18 : పర్చూరులో పురుగు మందుల దుకాణంలో చోరీ జరిగిన ఘటనపై ఆదివారం బాధితులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పర్చూరు - చీరాల ఆర్అండ్బీ రోడ్డులోని పురుగు మందుల దుకాణంలో శనివారం రాత్రి ఎగ్జాస్ట్ ఫ్యాన్ను తొలగించి, రంధ్రం తొలిచి దొంగలు షాపులోకి ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. దుకాణంలో ఉన్న రూ.96వేల నగదును దొంగిలించారు. ఈ చోరీ దృశ్యాలు సీసీ కెమెరా ఫుటేజీలో నమోదయ్యాయి. ఆదివారం ఉదయం షాపు యజమాని తలుపులు తీసి లోకిని వెళ్లడంతో ఎదురుగా ఉన్న గోడకి రంధ్రం ఉండడంతో ఆందోళనకు గురయ్యారు. వెంటనే గల్లాపెట్టిని పరిశీలించగా, నగదు కనిపించక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే పోలీసులు దుకాణాన్ని పరిశీలించారు. ఏఎస్ఐ సురేష్ రెడ్డి బాపట్ల క్లూస్ టీం సిబ్బందికి సమాచారం అందించారు. ఆ బృందం చోరీ జరిగిన ప్రాంతంలో ఆధారాలను సేకరించారు. యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.



ఈ రంధ్రం ద్వారానే దుకాణంలోకి వెళ్లిన దొంగలు



భూమిపూజలో పాల్గొన్న గ్రామస్థులు

దేవరగుడి నిర్మాణానికి భూమిపూజ

పంగులూరు, ఆగస్టు 18 : పంగులూరులో చిలుకూరి వంశస్తుల దేవర గుడి నూతన నిర్మాణానికి ఆదివారం భూమి పూజ జరిగింది. తెనాలికి చెందిన ప్రముఖ వేద పండితులు వేముల శ్రీహరి, త్రినాథ్ నేతృత్వంలో ఆలయ నిర్మాణానికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. కోటి రూపాయల అంచనాతో నిర్మించ తలపెట్టిన ఈ ఆలయానికి ప్రవాసాంధ్రుడు కొణకంచి రాము 10 సెంట్ల స్థలాన్ని, చిలుకూరి పెద్దబ్బాయి 5 సెంట్ల స్థలాన్ని ఉచితంగా ఇచ్చారు. ఆదివారం జరిగిన హోమాలు, ప్రత్యేక పూజల్లో చిలుకూరి వంశస్తులు వీరరాఘవయ్య, మేడ సుబ్బారావు, ప్రసాదనాయుడు, రామాంజనేయులు, కోటయ్య, మల్లవరం సర్పంచ్ వీరయ్య, చిలుకూరి రామారావు, హరికృష్ణ, చైతన్యతో పాటు పలువురు దంపతులు పాల్గొన్నారు. పంగులూరు, మల్లవరం, నక్కలపాలెం, ఏబీ పాలెం, చిలుకూరివారిపాలెం గ్రామాలకు చెందిన చిలుకూరి వంశస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు



సామూహిక పూజల్లో పాల్గొన్న భక్తులు

అద్దంకి, ఆగస్టు 18 : తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని శంఖవరప్పాడు(రెడ్డిపాలెం)లో లక్ష్మీ తిరుపతమ్మ ఆలయంలో వరలక్ష్మి వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. టీటీడీ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా కోఆర్డినేటర్ చెన్నుపల్లి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో వరలక్ష్మీ వ్రతాలను నిర్వహించారు. లక్ష్మీ తిరుపతమ్మ దేవాలయం నిర్వాహకులు జిలుగు రోశిరెడ్డి, నాగ శ్రీనివాసరెడ్డి, వెంకటలక్ష్మి భక్తులకు అవసరమైన పూజా సామగ్రిని గ్రి సమకూర్చారు. మాదాల దానయ్య రావినూతల రామకృష్ణ, పుట్టా వీరాంజనేయులు, పెద్దిశెట్టి వెంకటాద్రి పాల్గొన్నారు. 100 మంది భక్తులు వ్రతాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

145 మందికి కంటి పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

పంగులూరు, ఆగస్టు 18 : కంటి విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని శంకర్ కంటి వైద్యశాల నేత్ర వైద్య నిపుణుడు డాక్టర్ బిపిన్, డాక్టర్ ఉష అన్నారు. మండలంలోని ముప్పవరం గ్రామంలో శంకర్ కంటి వైద్యశాల సహకారంతో రోటరీ క్లబ్ ఆఫ్ పంగులూరు వారు ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఎస్ఐ బీ.వినోద్బాబు ప్రారంభించారు. సుమారు 145 మందికి వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించి, 90 మందికి కంటి శస్త్ర చికిత్సలు అవసరంగా గుర్తించారు. వీరందరికీ కాకాణి శంకర్ కంటి వైద్యశాలలో ఉచితంగా శస్త్ర చికిత్సలు చేస్తారని రోటరీ హెల్త్ క్యాంప్ ఇన్చార్జిలు వీరరాఘవయ్య, కరణం హనుమంతరావు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు శ్రీకృష్ణుని విగ్రహ ప్రతిష్ట

వీరన్నపాలెం (పర్చూరు), ఆగస్టు 18 : పర్చూరు మండల పరిధిలోని వీరన్నపాలెం గ్రామంలో దాతల సహకారంతో రూపుదిద్దుకున్న శ్రీ కుష్ణుని ఆలయంలో సోమవారం విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు ఆదివారం ప్రకటనలో తెలిపారు. కార్యక్రమం అనతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.



వీరన్నపాలెం చెరువు కట్టపై నిర్మించిన శ్రీకృష్ణాలయం

గ్రామాల్లో అటకెక్కిన పారిశుధ్యం

- విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు
- స్థానికుల్లో ఆందోళన

అద్దంకి, ఆగస్టు 18 : సీజనల్ వ్యాధులు విజృంభించాయి. గ్రామాలలో మురుగు నీరు ఎక్కడికక్కడే నిలిచి ఉండడంతోపాటు పారిశుధ్య పనులు నిర్వహణ పై క్షే త్ర స్థాయిలో దృష్టి పెట్టకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ప్రధానంగా ఇళ్ల నుంచి వచ్చే మురుగు పారుదలకు అవకాశం లేక ఎక్కడికక్కడే నిలిచి పోవడం, రోడ్లపై ప్రవహిస్తోంది. దీంతో ఆయా ప్రాంతాలు దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారాయి. దీనికితోడు వాతావరణ మార్పులతో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ప్రజలు జ్వరాలబారిన పడుతున్నారు. స్తోమత లేని కుటుంబాలు స్థానికంగా ఆర్ఎంపీలవద్ద వైద్యం చేయించుకుంటున్నారు. మరి కొందరు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి వేలకు వేలు ఖర్చు చేస్తున్నారు. ప్రభుత్వ వైద్యశాలలో చేరుతున్న వారి సంఖ్య తక్కువ గానే ఉన్నప్పటికి ప్రవేట్ వైద్యశాలలో చేరుతున్న వారి సంఖ్య ఎక్కువగానే ఉన్నారు. ప్రధానంగా ప్రస్తుతం వస్తున్న జ్వరాలలో అధిక భాగం టైఫాయిడ్, వైరల్ జ్వరాలు ఉన్నాయి. వైద్య శాఖ సిబ్బంది కూడా ముందస్తు చర్యలు చేపట్టకుండా జ్వర పీడితులు ఎక్కువ మంది అయిన తరువాత మొక్కుబడిగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. అప్పటికే ఆయా గ్రామాలలో ప్రవేట్ వైద్యశాలలో చేరిపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాలలో పారిశుధ్యం పనులపై ప్రత్యేక దృష్టి పెట్టి మురుగు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని, అదే సమయంలో వైద్య శాఖ అధికారులు ముందస్తుగానే ఆయా గ్రామాలలో వైద్య శిబిరాలు నిర్వహించి పరీక్షలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.



బల్లికురవ తహసీల్దార్ కార్యాలయం ముందు నిలిచిన మురుగు నీరు



ముక్తేశ్వరంలో వృద్ధురాలికి వైద్యం చేస్తున్న ఆర్ఎంపీ

అన్ని గ్రామాల్లో పారిశుధ్య పనులు

- జ్వరాలున్న చోట వైద్య శిబిరాలు నిర్వహించండి
- అధికారులను ఆదేశించిన మంత్రి గొట్టిపాటి

అద్దంకి, ఆగస్టు 18 : నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో వెంటనే పారిశుధ్య పనులు చేపట్టాలని, వైద్య శిబిరాలు నిర్వహించాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా వైద్యశాఖ అధికారులతో ఆదివారం ఫోన్లో ఆదేశించారు. గ్రామాలలో దోమలవ్యాప్తి ఎక్కువగా ఉండి డెంగ్యూ టైఫాయిడ్ తదితర జ్వరాల బారిన పడి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గొట్టిపాటి అన్నారు. విష జ్వరాలబారిన పడిన ప్రజలు ప్రైవేటు వైద్యశాలకు వెళ్లలేక ఆర్ఎంపీల వద్దే వైద్యం చేయించుకుంటున్నారన్నారు. గ్రామాలలో ప్రతి రోజూ విధిగా పారిశుధ్య పనులు, ఫాగింగ్ చేపట్టాలన్నారు. విషజ్వరాలకు సంబంధించిన మందులు అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేం ద్రాలలో ఉండేలా ఆరోగ్య శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వైద్య శిబిరాలను ఏర్పా టు చేయడంతో పాటు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇంటింటికీ వెళ్లి జ్వరాలతో బాధపడుతున్న వారి వివరాలను సేకరించేలా చర్యలు చేపట్టాలని వైద్యశాఖ అధికారులను ఆదేశించారు.

కొమ్మాలపాడులో కంపుకంపు

- కాలువల్లో పేరుకుపోయిన పూడిక
- రోడ్లపై పారుతున్న మురుగు నీరు
- కంపుతో ఇబ్బంది పడుతున్న ప్రజలు

కొమ్మాలపాడు (సంతమాగులూరు), ఆగస్టు 18 : మండలంలోని కొమ్మాలపాడు గ్రామంలో మురుగునీరు వీధుల్లో పారుతోంది. కొంత కాలంగా సైడు కాలువలో పూడిక తీయకపోవడంతో మురుగునీరు వీధుల్లోకి వచ్చి కంపుకొడుతోందని గ్రామస్థులు అంటున్నారు. గ్రామంలో బల్లికురవ రోడ్డు, మొయిన్రోడ్డు, పెద్ద మనుషల రోడ్డు, ప్రధాన వీధుల్లోని కాలువల్లో పూడిక తీయించాలని డిమాండ్ చేస్తున్నారు. వాహనాలు వెళ్లే సమయంలో మురుగు నీరు నడిచివెళ్లేవారిపై పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మురుగునీరు బయటకు పోకపోవడంతో దోమల తీవ్రత ఎక్కువైందని, ప్రజలు జ్వరాలబారిన పడుతున్నారని తెలిపారు. వెంటనే పారిశుధ్య పనులు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.



రోడ్డుపై నిలిచి ఉన్న మురుగు నీరు

అద్దంకి ఎస్ఐ వీఆర్కు

- తీవ్ర అవినీతి ఆరోపణలు
- మంత్రికి ఫిర్యాదు చేసిన పలు గ్రామాల ప్రజలు

అద్దంకి, ఆగస్టు 18 : అద్దంకి పోలీస్ స్టేషన్లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న నాగరాజును వీఆర్కు పిలిచారు. ఎన్నికల ముందు అద్దంకి పోలీస్ స్టేషన్కు వచ్చిన నాగరాజు ఎస్హెచ్వోగా ఉన్న అధికారిని సైతం తప్పు దారి పట్టించే విధంగా వ్యవహరిస్తూ ఎన్నికల సమయంలో రెండు పార్టీల నాయకుల ద్వారా డబ్బులు దండుకున్నారన్న విమర్శలు ఉన్నా యి. ఎన్నికల పూర్తయి టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత కూడా పాత పద్ధతినే కొనసాగిస్తూ పలు కేసులలో వైసీపీ వర్గీయుల వద్ద డబ్బులు తీసుకుంటూ టీడీపీ వర్గీయుల కేసులను నీరుగార్చే విధంగా వ్యవహరించినట్లు పలు గ్రామాల ప్రజలు మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా చినకొత్తపల్లిలో టీడీపీ వర్గీయులు బాధితులుగా ఉన్నప్పటికీ వైసీపీ వర్గీయులతో మిలాఖత్ అయి కేసును పక్కదారి పట్టించినట్లు కూడా ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయాలు మొత్తం నిర్ధారణ చేసుకున్న తరువాత మంత్రి గొట్టిపాటి ఈ నెల 16వ తేదీన అన్న క్యాంటీన్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి వచ్చిన సమయంలో పలు గ్రామాల ప్రజలు ఎస్ఐ తీరుపై ఫిర్యాదు చేశారు. అక్కడే ఉన్న ఎస్ఐ నాగరాజుతో మంత్రి రవికుమార్ ఒకింత కటువు గానే చెప్పినట్లు తెలుస్తుంది. ఇంకా పద్ధతి మార్చుకొని ఉద్యోగం చేయకపోతే కష్టం అని కూడా కష్టం అని చెప్పినట్లు సమచారం. ఈ విషయాలు జిల్లా పోలీస్ అధికారుల దృష్టికి కూడా పోవడంతో శుక్రవారం వీఆర్కు పిలిచారు. ఎస్ఐ నాగరాజును వీఆర్కు పిలిచిన విషయాన్ని ఎస్హెచ్వోగా ఉన్న సీఐ కృష్ణయ్య నిర్ధారించారు. ఇప్పటికే సీఐ కృష్ణయ్య ఆరోగ్య రీత్యా సెలవులో ఉండగా మహిళా ఎస్ఐ రత్నకుమారి బదిలీపై వెళ్లారు. నాగరాజును వీఆర్కు పిలవడంతో అద్దంకి పోలీస్ స్టేషన్లో ప్రస్తుతం సిబ్బంది మాత్రమే మిగిలారు. ఇప్పటికే మహిళా ఎస్ఐగా ప్రవీణను నియమించగా, మరో ఎస్ఐని కూడా త్వరలో నియమించనున్నట్లు తెలుస్తుంది. ఇద్దరు ఎస్ఐలు త్వరలో బాధ్యతలు తీసుకోనున్నట్లు తెలుస్తుంది.

గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

చినగంజాం, ఆగస్టు 18 : జనసేన పార్టీ నాయకులు, సైనికులు, వీరమహిళలను సమన్వయం చేసుకుంటూ గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెదపూడి విజయ్కుమార్ అన్నారు. పల్లెపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని పెద్దపల్లెపాలెం, బాపయ్యనగర్ గ్రామాలకు జనసేన పార్టీ గ్రామ అధ్యక్షులను ఆదివారం ఆయన నియమించారు. పెద్దపల్లెపాలెం, బాపయ్యనగర్ గ్రామాలకు చెందిన రాసాని గోపి, దండుప్రోలు అంజయ్యను గ్రామ పార్టీ అధ్యక్షులుగా ఎంపికచేసి నియామక పత్రాలను అందజేశారు. రాష్ట్ర పార్టీ ఆదేశాలను పాటిస్తూ గ్రామ స్థాయిలో పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తూ ముందుకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు సందు శ్రీనివాసరావు, ఉమ్మడి ప్రకాశం జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి తుమ్మలపెంట సతీష్, నాయకులు వెంకట్, తోట ఆశోకచక్రవర్తి, వాసుదేవరావు, నోవా, వాసు, ఆయా గ్రామాల జనసైనికులు పాల్గొన్నారు.



గ్రామ అధ్యక్షులకు నియామకపత్రాలను అందజేస్తున్న విజయ్కుమార్